



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 142 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా శుక్రవారం 3 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 142 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, FRI 3 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# ఇక అమరావతికి తిరుగులేదు..
# రాష్ట్రానికి కొత్త శకం మొదలైంది

- రాజ్యసభలోనూ ఆమోదం పొందిన అమరావతి బిల్లు
- అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తించిన పార్లమెంట్
- ఇది చారిత్రక ఘట్టమని అభివర్ణించిన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాకు ప్రత్యేక కృతజ్ఞతలు
- రైతుల త్యాగాలకు దక్కిన గౌరవమని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:రాజ్యసభలో గురువారం అమరావతి బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక చారిత్రక, నిర్వచనాత్మక ఘట్టమని సీఎం చంద్రబాబు నాయు డు అభివర్ణించారు. అమరావతికి తిరుగులేదని, అది ఆంధ్రప్రదేశ్ హృదయమని, భవిష్యత్తులో దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026 పార్లమెంట్ ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం ద్వారా ప్రజల సమష్టి ఆకాంక్షలకు జాతీయ స్థాయిలో బలమైన గొంతుక లభించిందని చంద్రబాబు పేర్కొన్నారు. "రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ అనేక సవాళ్లు, అనిశ్చితులను ఎదుర్కొంది. ఈ క్లిష్ట సమయంలో అమరావతి రైతులు చేసిన అసమానమైన త్యాగం, చూపిన విశ్వాసం, కనబరిచిన ధైర్యమే ఈ కలను సజీవంగా నిలిపాయి. ఈ చారిత్రక విజయం వారికే అంకితం," అని ఆయన అన్నారు.ఈ నిర్ణయంతో రాష్ట్రానికి దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న స్థిరత్వం లభించిందని, ప్రతి పౌరుడికి సాధికారత, ఆత్మవిశ్వాసం, ప్రగతితో కూడిన కొత్త శకానికి నాంది పలికిందని తెలిపారు. "అమరావతి రాజధాని హోదా ఇప్పుడు ఎలాంటి సందేహాలకు, చర్చలకు, మార్పులకు తావులేకుండా పటిష్టంగా స్థిరపడింది" అని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్ర ఆకాంక్షలకు అండగా నిలిచిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి చంద్రబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2015 అక్టోబర్ 22న అమరావతికి శంకుస్థాపన చేసిన నాటి నుంచి, 2025 మే 2న దాని పురోగతికి పునరుజ్జీవం పోసే వరకు ప్రతి కీలక దశలోనూ ప్రధాని మోదీ అమరావతికి అండగా నిలిచారని కొనియాడారు. ఈ బిల్లు ముందుకు సాగడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు, కేంద్ర ప్రభుత్వానికి కూడా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. విభేదాలను పక్కనపెట్టి అమరావతిని ఏకైక 'ప్రజా రాజధాని'గా పునరుద్ఘాటించిన అన్ని పార్టీలు, పార్లమెంట్ సభ్యులకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.గురువారం రాజ్యసభలో ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించినట్లు సభాధ్యక్షులు సి.పి. రాధాకృష్ణన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్డీయే సభ్యులు హర్షధ్వానాలు చేశారు. దీంతో అమరావతి ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా చట్టబద్ధమైన గుర్తింపు పొందింది.



## అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది

- ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయన్న ట్రంప్
- ట్రంప్ చెప్పినట్లు తమ సైనిక సామర్థ్యాలను దెబ్బతినలేదన్న ఇరాన్
- మా ఆయుధ సంపత్తి గురించి అమెరికాకు సమాచారం లేదన్న ఇరాన్

పెన్ పవర్ డెస్క్:అమెరికా తమకు లొంగిపోయేవరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని, వారి నాయకత్వాన్ని తీవ్రస్థాయిలో

మిగతా 2లో



## అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం.. వాకౌట్ చేసిన వైసీపీ

- అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ చట్టసవరణ బిల్లు
- రాజ్యసభలో చర్చ అనంతరం బిల్లుకు ఆమోదం
- ఇప్పటికే లోక్ సభలో బిల్లుకు ఆమోదం

పెన్ పవర్ డెస్క్:అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఈ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. ఈరోజు రాజ్యసభలో చర్చ అనంతరం ఆమోదం తెలిపింది.కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ఈ బిల్లుపై చర్చను ప్రారంభించారు. బిల్లుపై చర్చ సమయంలో వైసీపీ ఎంపీలు వాకౌట్ చేశారు.రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన అనంతరం రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతికి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదం ఉంటుందని అన్నారు. కాగా, రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టంగా మారనుంది. సభలో 11 పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. పది పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు.



## భారత నౌకలకు డోకా లేదు..

హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక ప్రకటన

- హర్మూజ్ జలసంధిలో భారత నౌకల భద్రతపై ఆందోళన వద్దన్న ఇరాన్
- ఇజ్రాయెల్, అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో జలసంధిపై ఆంక్షలు
- ఇప్పటివరకు 8 భారత నౌకలను సురక్షితంగా బయటకు పంపిన ఇరాన్
- భారత్‌కు రావాల్సిన మరో 19 నౌకలు ఇంకా జలసంధిలోనే చిక్కుకుపోయిన వైనం
- భారత్, చైనా, రష్యా వంటి మిత్ర దేశాలకు మాత్రమే అనుమతిస్తున్నట్లు ప్రకటన

మిగతా 2లో

## రాజధానికి పట్టిన గ్రహణం వీడింది..

ఇంటింటా దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకుందాం: మంత్రి నారా లోకేశ్

- అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్లో బిల్లుకు ఆమోదం
- ఇంటింటా దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకోవాలని లోకేశ్ పిలుపు
- #APThanksIndia హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టులు పెట్టాలని సూచన
- రాజ్యసభలో బిల్లు పాసయ్యాక ఎంపీలతో మంత్రి లోకేశ్ భేటీ
- రాష్ట్రపతి ఆమోదం తర్వాత గెజిట్ విడుదల చేయనున్న కేంద్రం

పెన్ పవర్ డెస్క్:ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టపరమైన హామీ లభించింది. ఈ మేరకు ప్రవేశపెట్టిన ఏపీ పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభలు ఆమో దముద్ర వేశాయి.

మిగతా 2లో




## నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు

తెలంగాణ బీజేపీ ఎంపీ

- విభజన తర్వాత అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకున్నారన్న లక్ష్మణ్
- రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందన్న లక్ష్మణ్
- జగన్ హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బంది పెట్టారని మండిపాటు

మిగతా 2లో





## హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం.. 35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

- హర్మూజ్ జలసంధి సంక్షోభంపై యూకే ఆధ్వర్యంలో 35 దేశాల సమావేశం
- ఈ కీలక భేటీకి భారత్‌ను ఆహ్వానించిన యునైటెడ్ కింగ్‌డమ్
- వర్చువల్ సమావేశానికి హాజరుకానున్న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ
- ఇప్పటికే 6 భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటాయని తెలిపిన విదేశాంగ శాఖ
- మిత్రదేశాలు సొంతంగా పోరాడాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

మిగతా 2లో

## ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

- ఏ మాత్రం నిధుల లభ్యత ఉన్నా పెండింగ్ బిల్లులను చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశం
- బిల్లుల చెల్లింపుల్లో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి సూచన
- పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆర్థిక శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష

పెన్ పవర్ డెస్క్:గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెండింగ్ బిల్లుల చెల్లింపులపై గురువారం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆర్థిక శాఖపై సమీక్షించారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యో గుల పెండింగ్

మిగతా 2లో





## చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుంది

పెన్ పవర్ డెస్క్:తెలుగు ప్రజలందరికీ చరిత్రాత్మకమైన రోజు అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుందని చెప్పారు. రాజ్యసభలో అమరావతికి చట్టబద్ధత బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రవేశపెట్టారు. అనంతరం చర్చకు ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ అనుమతించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. "అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మా నాయకుడు నేర్పించారు. ఏపీ రాజధాని గురించి

మిగతా 2లో

## హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు



- ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ సోదాలు
- బెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి ఈడీ సోదాలు
- గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# భావజాలాన్ని అంతమొందించలేరు...!

నక్సలైట్ ఉద్యమం ముగింపు దినం 2026 మార్చి 31. అంటే దేశంలో కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సాయుధ పోరాటం చేస్తున్న ఒక సిద్ధాంత పార్టీని నిర్మూలించాలనే కేంద్ర ప్రభుత్వ సంకల్పం దినం. ఈ కాలంలో వేలాది మావోయిస్టులు, పోలీసులు, నిర్భాగ్యులైన ఆదివాసీలు మరణించారు. ఈ ఆరు దశాబ్దాలలో మావోయిస్టు ఉద్యమం చాలా పొందింది, చాలా కోల్పోయింది. దినిని ఎవరూ నిరాకరించలేరు.

మార్క్సిస్టు–లెనినిస్టు, మావోయిస్టు సిద్ధాంతం బలంతో ప్రారంభమైన నక్సల్బరి ఉద్యమం క్రమంగా దేశమంతటా వ్యాపించింది. దీనికి ప్రధాన కారణం – కులం, మతం పేరుతో పేద వర్గాలపై ఉన్నత వర్ణాలు, పెట్టుబడిదారులు, సామంతుల అణచివేత, అన్యాయం, అత్యాచారాలు. మావోయిస్టు ఉద్యమం పేద, సర్వహారా వర్గాలపై జరుగుతున్న, చేస్తున్న అణచివేత, అన్యాయం, అసమానత, అత్యాచారాలు చేస్తున్న వారిని గుర్తించేలా చేసింది. స్వతంత్ర దేశ ప్రభుత్వాలు దీనిని సరిగ్గా గుర్తించి ఉంటే, ఇపుడు వేలాది, లక్షలాది మావోయిస్టులు, పోలీసులు, నిర్భాగ్యులైన ఆదివాసీలు చనిపోయేవారు కాదు. అణచివేత, అన్యాయం, అసమానత, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు నక్సలైట్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వేలాది మంది యువకులు ఈ ఉద్యమంలో చేరారు. ప్రజలను చైతన్యపరిచారు. ఆదివాసీలకు విద్యాబోధన చేసి, అనేక రకాల శిక్షణలు ఇచ్చారు. ప్రారంభంలో పోలీసులు, నక్సల్ వాదుల మధ్య పెద్ద శత్రుత్వం ఏమీ లేదు. నక్సలైట్లు గ్రామాల్లో సామంత వర్గాలకు వ్యతిరేకంగా తమ ఉద్యమాన్ని తీవ్రం చేశారు. దీన్ని చూసి సామంతులు ప్రభుత్వాలను సంప్రదించారు. ప్రభుత్వం సామంతుల భద్రత కోసం గ్రామాల్లో పోలీసులను పంపి నక్సలైట్లను తమ లక్ష్యంగా చేసుకుంది. ఇదే సమయంలో దేశంలో పెరుగుతున్న నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రజాస్వామ్య ప్రభుత్వం నిషేధం విధించింది. దీన్ని చూసి నక్సలైట్లు తమ భద్రత కోసం ఆదివాసీ ప్రాంతాలకు వెళ్లి, ఖనిజ సంపద, ప్రకృతిని కాపాడేందుకు కృషి చేయడం ప్రారంభించారు. పెట్టుబడిదారులు, పెద్ద కంపెనీల ధనబలంతో రాజ్యాంగం మీద ప్రమాణం చేసి మళ్లీ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పెట్టుబడిదారుల, పెద్ద కంపెనీల కోసం మావోయిస్టులను అడవుల నుంచి తరిమేందుకు ఆపరేషన్ కగార్ ప్రారంభించింది. దీని ఫలితంగా పెద్ద ఎత్తున వేలాది మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపివేయబట్టారు. కొంత మంది మావోయిస్టు నాయకులు లొంగిపొయారు. ఈ ప్రక్రియకు ముందు మావోయిస్టుల వైపు నుంచి అనేక శాంతి ప్రతిపాదనలు వచ్చాయి. అయినప్పటికీ, ప్రభుత్వం అన్ని ప్రతిపాదనలను తోసిపుచ్చింది, లొంగిపొండి లేదా ఎన్‌కౌంటర్‌లో చనిపోండి అని ప్రతిపాదన చేసింది. దేశాన్ని రక్షించే సైన్యాన్ని ఆధునిక ఆయుధాలతో తమ సొంత పౌరుల మీద దాడి చేసింది. దేశంలో ఇప్పటికీ అనేక మంది నక్సలైట్లు అడవుల్లో, జైళ్లలో ఉన్నారు. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుడు గణపతి ఇప్పటికీ అజ్ఞాతంలో ఉన్నారు. ఇదే సమయంలో ఒడిశా ఎమ్ఏడీసీ విభాగం కార్యదర్శి రజితా సాయుధ పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేసిన సహచరుల మరణం వృధా పోనివ్వమని ఆమె చెప్పారు. మావోయిస్టుల సాయుధ పోరాటం ప్రతీ హింస కోసమేనని అందరికీ తెలుసు. దేశ, ప్రపంచ పౌరులు మంచి ప్రత్యామ్నాయ ప్రభుత్వం కోసం వెతుకుతున్నారు. ప్రతి ఒక్కరూ మార్పు కోరుకుంటున్నారు. ఈ మార్పు మావోయిస్టు భావజాలం ద్వారా సాధ్యమవుతుంది. మావోయిస్టు భావజాలం ఇప్పటికీ ప్రజల్లో సజీవంగా ఉంది, భవిష్యత్తులో కూడా ఉంటుంది

# రాజధానికి పట్టిన గ్రహణం వీడింది..

- మొదటి పేజి తరువాయి

ఈ చారిత్రాత్మక పరిణామం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరుపుకోవాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. దీంతో రాష్ట్ర ప్రజలు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. ఈ విషయంపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ (శ) వేదికగా స్పందిస్తూ... "రాజధానికి పట్టిన గ్రహణం వీడి, ప్రజా రాజధానికి చట్టబద్ధత లభించింది" అని హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని నేడు రాత్రి 7 గంటలకు ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించి వేడుకలు జరుపుకోవాలని ప్రజలను కోరారు. దీపాలతో సెల్ఫీ తీసుకుని 'మన రాజధాని మన గౌరవం' అంటూ చాూాష్ఘుఅఎం×అఎఋ హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని సూచించారు. బిల్లుపై చర్చ జరిగిన సమయంలో రాజ్యసభ గ్యాలరీ నుంచి లోకేశ్ ప్రక్రియను పర్యవేక్షించారు. బిల్లు ఆమోదం పొందాక, దీనికి సహకరించిన పలు పార్టీల ఎంపీలను ఆయన నేరుగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రాజ్యసభ క్యాంటీన్‌లో వారితో భేటీ అయ్యారు. గురువారం రాజ్యసభలో ఈ బిల్లుపై దాదాపు రెండు గంటల పాటు చర్చ జరిగాక ఆమోదం లభించింది. తదుపరి ప్రక్రియలో భాగంగా కేంద్ర కేబినెట్ దీనికి పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేసి, రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో అమరావతికి చట్టబద్ధత ప్రక్రియ పూర్తవుతుంది.

# భారత నౌకలకు డోకా లేదు..

ఇజ్రాయెల్, అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించిన ఇరాన్.. భారత్‌కు కీలక హామీ ఇచ్చింది. "భారత మిత్రులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు. వారు సురక్షితంగా ఉన్నారు" అని భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం గురువారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించింది. ఈ భరోసాతో భారత్ కాస్త ఊపిరి పీల్చుకుంది. ప్రపంచంలోని 20 శాతం ఇంధన రవాణా జరిగే హర్మూజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో ఉంది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికాతో వివాదం మొదలైనప్పటి నుంచి ఇరాన్ ఈ మార్గంలో రాకపోకలను దాదాపు నిలిపివేసింది. అయితే భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ వంటి స్నేహపూర్వక దేశాల నౌకలను మాత్రమే అనుమతిస్తున్నట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఈ దిగ్బంధనం వల్ల భారత్ సహా పలు దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే 8 భారత నౌకలు హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. వీటిలో దీఔ ్=, దీఔ జూవీ అనే రెండు ఎల్‌పీజీ క్యారియర్లు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 94,000 టన్నుల ఎల్‌పీజీ భారత్‌కు చేరింది. అయితే, భారత్‌కు రావాల్సిన ఎల్‌పీజీ, ముడిచమురు, ఎల్ఎన్‌జీతో కూడిన మరో 19 నౌకలు ఇంకా అక్కడే చిక్కుకుపోయాయని అధికారులు తెలిపారు.

ఇటీవల జరిగిన

మంత్రిత్వ శాఖల సమావేశంలో షిప్పింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ఈ వివరాలు వెల్లడించారు. చిక్కుకున్న నౌకల్లో భారత్‌కు చెందినవి 9 ఉండగా, విదేశీ జెండాలతో భారత్‌కు వస్తున్నవి 10 ఉన్నాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభం కారణంగా మొత్తం 500 నౌకలు జలసంధిలో నిలిచిపోయినట్లు సమాచారం.

# హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం.. 35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మూసివేసిన హర్మూజ్ జలసంధి సంక్షోభం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ మార్గాన్ని తిరిగి తెరిపించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) నడుం బిగించింది. ఇందులో భాగంగా 35 దేశాలతో నిర్వహిస్తున్న అత్యవసర సమావేశానికి భారత్‌ను కూడా ఆహ్వానించింది. గురువారం వర్చువల్‌గా జరిగే ఈ భేటీలో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పాల్గొంటారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ధ్రువీకరించారు. భారత ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. దేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 40శాతం, ద్రవీకృత సహజ వాయువు (ాచీ+)లో 50శాతం, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (్రూ+)లో 80శాతానిపైగా ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. ఈ నేపథ్యంలో భారత నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇరాన్‌తో పాటు ఇతర సంబంధిత దేశాలతో చర్చిస్తున్నామని జైస్వాల్ తెలిపారు. ఈ చర్చల ఫలితంగానే గత కొన్ని రోజుల్లో ఆరు భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటగలిగాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా స్పందించారు. గతంలో జలసంధిని తెరిపించడం తన ప్రాధాన్యత అని చెప్పిన ఆయన, బుధవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ప్లేటు ఫిరాయించారు. "మీ చమురు మీరే తెచ్చుకోండి. మీ కోసం మీరు పోరాడటం నేర్చుకోండి. అమెరికా ఇకపై మీకు సహాయం చేయదు" అంటూ యూకే వంటి మిత్రదేశాలకు ఆయన సూచించారు. ఇరాన్‌ను ఇప్పటికే దెబ్బతీశామని, కష్టమైన భాగం పూర్తయిందని ట్రంప్ పేర్కొన్నారు.

మరోవైపు యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూఏఈ సహా 35 దేశాలు సముద్ర భద్రత పునరుద్ధరణకు కలిసి పనిచేయడానికి అంగీకరించాయని

ప్రకటించారు. నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరించడం, చిక్కుకుపోయిన నౌకలు, సిబ్బంది భద్రతను పటిష్టం చేయడం, కీలక సరుకుల రవాణాను తిరిగి ప్రారంభించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. యూకే విదేశాంగ కార్యదర్శి వైవెట్ కూపర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీ అనంతరం, తదుపరి కార్యాచరణపై అధికారులు చర్చిస్తారని సమాచారం.

# అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది

- మొదటి పేజి తరువాయి

దెబ్బతీశా మని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ధీటుగా స్పందించింది. ట్రంప్ చెప్పినట్లుగా తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని పేర్కొంది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి ప్రకటన చేయగా, ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తి సమాచారం లేదని పేర్కొంది. వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతో పాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామని ట్రంప్ చేసిన వాదనలను ఇరాన్ ఖండించింది. అమెరికా రాతి యుగం నాటి నేరాలను ఆధునిక యుగానికి తీసుకువస్తోందని ఆరోపించింది. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చతెచ్చే నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది.

# చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుంది

- మొదటి పేజి తరువాయి

ప్రజలకు స్పష్టత ఇస్తున్నాం. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది.. మరో రాష్ట్రానికి అలా లేకుండా వదిలేయడంతో సమస్య మొదలైంది. విభజనకు వ్యతిరేకం కాదు కానీ.. జరిగిన విధానం సరిగా లేదు. రాష్ట్ర విభజన దేశంలో తొలిసారి జరగలేదు. వాజ్‌పేయి హయాంలో 3 రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విభజన జరిగింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి రూ.16వేల కోట్ల రెవెన్యూ లోటు ఉంది. 5 కోట్ల మంది ఏపీ ప్రజలు సీఎం చంద్రబాబు వైపు ఆశగా ఎదురుచూశారు. తెలుగు ప్రజలకు ఆయన ఎన్నో ఆకాంక్షలు, విజన్ కల్పించారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుని ముందుకెళ్లారు. రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములిచ్చారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల నాటకమాడింది. రాజధాని అమరావతి కోసం ఉద్యమించిన రైతులను తీవ్రంగా హింసించారు. గర్భిణులు అని కూడా చూడకుండా లాఠీలతో కొట్టించారు. అమరావతి మహిళలకు సాష్టాంగ

నమస్కారం చేస్తున్నా. 2014లోనే అసెంబ్లీలో అమరావతిపై ఏకగ్రీవ తీర్మానం జరిగింది. చరిత్రలో ఏ రాజధాని చూసినా నదీ తీర ప్రాంతాల్లోనే విలసిల్లాయి. కృష్ణా నది తీరంలో అమరావతి నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐకానిక్, వరల్డ్ క్లాస్ రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది" అని రామ్మోహన్‌నాయుడు అన్నారు.

# నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు

దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరమని ఆయన అన్నారు. రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. భవ్య రాజధాని కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యమన్నారు. రాజధాని అవసరమని, కానీ జగన్ తన హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. రాజధాని కోసం చాలాకాలంగా పోరాడిన మహిళలకు, రైతులకు ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. అమరావతి బిల్లు కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చిందని అన్నారు.

# హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

పశ్చిమ బెంగాల్‌లో బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ప్రముఖ రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తోంది. ఐప్యాక్ కన్సల్టెన్సీ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా దర్యాప్తు సంస్థ దృష్టి సారించింది. బొగ్గు స్మగ్లింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కొంతకాలంగా సోదాలు జరుగుతున్నాయి. గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాలు, ఐప్యాక్ అధినేత ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించింది. నాడు సోదాల సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా అక్కడకు వచ్చి, మీడియా ఎదుటే ఫైళ్లతో వెళ్తూ కనిపించడం చర్చకు దారితీసింది. సోదాల సమయంలో బెంగాల్ ప్రభుత్వం నుంచి ఆటంకాలు ఎదురయ్యాయని ఈడీ అప్పుడు ఆరోపించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. మరోవైపు, మమతా బెనర్జీ కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపణలను ఖండించింది. సోదాల పేరుతో ఈడీ తన పరిధిని ఉల్లంఘించిందని ఆరోపించారు.

# ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజి తరువాయి

బిల్లుల చెల్లింపులపై ఆరా తీశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరపాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారని అడిగారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు కసరత్తు చేశామని, నిధుల లభ్యతను బట్టి చెల్లింపులను జరుపుతున్నామని అధికారులు వివరించారు.

ఉద్యోగులకు రిలీఫ్ ఇచ్చేలా మొత్తంగా రూ.7,358 కోట్ల మేర పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీంట్లో భాగంగా ఇప్పటికే ప్రావిడెంట్ ఫండ్ బకాయిల కింద రూ.1,848 కోట్లను నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామని, అలాగే గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద 4,793 మందికి సంబంధించిన రూ.76 కోట్ల చెల్లింపులు కూడా పూర్తి చేశామని వెల్లడించారు. వీటితో పాటు గ్రాట్యుటీ బకాయిల కింద రూ.3,411 కోట్లు, పెండింగులో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ.1,800 కోట్లు, పోలీస్ శాఖకు సంబంధించి అదనపు సరెండర్ లీవుల నిమిత్తం రూ.223 కోట్ల బిల్లుల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని మరో రెండు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. తల్లికి వందనం తర్వాత ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో చెల్లింపులు జరుపుతోంది ఉద్యోగులకు మాత్రమేనని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిధుల లభ్యతను బట్టి ఉద్యోగుల పెండింగ్ బిల్లుల సహా అన్ని రకాల పెండింగ్ బిల్లులకు చెల్లింపులు జరపాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల విషయంలో జరిగిన పరిణామాలు ప్రస్తావనకు వచ్చాయి. నాడు ఉద్యోగుల సొంత సొమ్మును కూడా నాటి ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో వారు తీవ్ర ఇబ్బందులుపడ్డారని, తమ నిధుల కోసం ప్రశ్నించిన నేతలపై కేసులు పెట్టి వేధించారనే అంశం చర్చకు వచ్చింది. ఇదే సమీక్షా సమావేశంలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు, మెటిరియల్ సరఫరా చేసిన వారికి జరపాల్సిన చెల్లింపులపైనా ముఖ్యమంత్రి ఆరా తీశారు. వివిధ శాఖలకు మెటీరియల్ సరఫరా చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లకు రూ.614 కోట్ల బకాయిల చెల్లింపులు జరిపామని అధికారులు తెలిపారు. పనులు చేసిన, మెటిరీయల్ సరఫరా చేసిన వాళ్లకు బిల్లులు చెల్లింపులు జరిపే ప్రక్రియలో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి





నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 2. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం కందుకూరులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రణవి చిన్నపిల్లల, కంటి వైద్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కలియదిగిరి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్లు నవీన్, ప్రశాంతి దంపతులను అభినందించారు. కందుకూరులో ఒక మంచి వసతులతో కూడిన ఆసుపత్రిని అందుబాటులోకి తేవడం గొప్ప విషయమన్నారు. ఇప్పటివరకు చిన్న పిల్లలకు సంబంధించి లేదా కంటి వైద్యానికి సంబంధించి సమస్య వస్తే ఒంగోలు లేదా నెల్లూరుకు వెళ్లేవారని, ఇకపై అలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. అనుభవం ఉన్న డాక్టర్ల పర్యవేక్షణలో ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందుతాయన్నారు.

ప్రజల జేబు చూసి వైద్య సేవలు అందించాలని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎంపీ వేమిరెడ్డి డాక్టర్లకు సూచించారు. అనంతరం పట్టణంలోని తులసి డెంటల్ హాస్పిటల్‌ను సందర్శించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, స్థానిక నాయకులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి ధ్వజస్తంభ బంగారు తాపడ సంప్రోక్షణ మహోత్సవం

**ధ్వజస్తంభానికి బంగారు తాపడం చేయించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ దంపతులు**

**కన్నుల పండువగా సాగిన కార్యక్రమం**







నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 2. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతుల సౌజన్యంతో నెల్లూరు రూరల్ పరిధిలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభ బంగారు తాపడం సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం ఉదయం వేద మంత్రోచ్చరణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ దంపతులు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులకు టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆహ్వానం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న వేమిరెడ్డి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొని యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహించారు. అనంతరం బంగారు తాపడం చేయించిన ధ్వజస్తంభాన్ని ఆవిష్కరించగా ధగధగ మెరుపులతో అద్భుతంగా దర్శనమిచ్చింది. భక్తులు తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ఆలయ ధ్వజస్తంభానికి బంగారు తాపడం చేయించడం తమ అదృష్టం అన్నారు. అమ్మవారి దయతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గతేడాది జులైలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట చేపట్టామని, 8 నెలలకే ధ్వజ స్తంభానికి బంగారు తాపడం చేయించడం హర్షనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నారు. నెల్లూరు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని వారు ఆకాంక్షించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ ధ్వజ స్తంభానికి బంగారు తాపడం చేయించిన వేమిరెడ్డి దంపతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. స్వామివారి కటాక్షం వారిపై ఎప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, ఆలయ ఈఓ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి పేరిట అడ్డగోలు దోపిడీ - కాకాణి





నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 2. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గం, ముత్తుకూరు మండలం, పంటపాలెం గ్రామంలో పర్యటించిన మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి అమరావతి పేరిట బాబు అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నాడన్న కాకాణి బాబు దోపిడి బయటపడుతుందనే అమరావతికి చట్టభద్రత అంటూ, కొత్త డ్రామాలు మొదలు పెట్టాడని ఎద్దేవా చేసిన కాకాణిఅమరావతి ప్రజల రాజధాని, దేవతల రాజధాని, అని ప్రకటనలు చేస్తూ, ప్రజలను మభ్యపెడుతూ, తన సొంత ఆదాయ రాజధానిగా మార్చుకున్నాడన్న కాకాణి చంద్రబాబు తానా అంటే, క్రింద స్థాయి నాయకులు తందానా అన్నట్లు, అమరావతికి చట్టబద్ధత పేరిట నానా యాగీ చేస్తున్నారన్న కాకాణి జగన్మోహన్ రెడ్డి సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చేటప్పటికి మింగుడు పడక, తెలుగుదేశం శ్రేణులు అయోమయంలో పడ్డారన్న కాకాణి మావిగన్ పేరిట మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులను కలుపుతూ రాజధాని కారిడార్ నిర్మించాలన్న జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదనను తెలుగు ప్రజలు ఆహ్వానిస్తున్నారన్న కాకాణి మహేంద్ర బాబు, లక్ష్మీల వాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి, అనారోగ్యానికి గురైన రావి రవీంద్రబాబు రెడ్డి పరామర్శించిన కాకాణి

# వైభవంగా కోదండరాముడి రథోత్సవం

ఒంటిమిట్ట పెన్ పవర్,ఏప్రిల్ 2:ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు గురువారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. శ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరాములవారు రథాన్ని అధిష్టించి గ్రామవీధుల్లో విహరించారు. భజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఓ సిహెచ్.వెంకయ్య చౌదరి, జెఇఓ వి.వీరబ్రహ్మం, ఎ.శరత్, డెప్యూటీ ఇఓ ప్రశాంతి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఇంజినీరింగ్ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.రేపు చక్రస్నానం : శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు శనివారం ఉదయం 10.30 నుండి 11.15 గంటల వరకు చక్రస్నానం వైభవంగా జరుగనుంది. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.5న పుష్పయాగం : శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో 10వ రోజు ఆదివారం సాయంత్రం 6 నుండి రాత్రి 9.00 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.ఒంటిమిట్ట అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ : సిఎం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి



ఆలయం అభివృద్ధికి టిటిడి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశీలించారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా।

# డాక్టర్ చీదరాలచెన్నయ్య మాస్టార్ కి సత్కారం



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 2. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ గా తన పదవీ కాలాన్ని పూర్తి చేసుకొని గ్రామాన్ని అభివృద్ధి పథం లో ముందుకు నడిపించి నేటితో సర్పంచ్ పదవీ కాలం ముగుస్తున్న తరుణంలో ఓడ పెంచలయ్య ను అధికారులు,వార్డ్ మెంబర్స్, అభిమానులు, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని యం పి పి యస్ పెనుబల్లి (మెయిన్) నందు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ డాక్టర్ యం వి రావు ఫౌండేషన్ వారిచే" జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ "ఉగాది పురస్కారాన్ని అందుకొన్న డాక్టర్ చీదరాల చెన్నయ్య ను పెనుబల్లి గ్రామ సర్పంచ్ ఓడ పెంచలయ్య, జొన్నవాడ ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ కీలుకుప్ప శ్రీనివాసులు యాదవ్, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఓడ పెంచలయ్య మాట్లాడుతూ విద్య, విద్యార్థుల పట్ల నిబద్ధత కల్గి గ్రామంలో డ్రాపౌట్స్ లేకుండా పాఠశాల అభివృద్ధి కి కృషి చేస్తున్న ఆదర్శ ఉపాధ్యాయులు మా చెన్నయ్య మాస్టారు అని అన్నారు. జొన్నవాడ ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్ కీలుకుప్పశ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యను బోధించడంతో పాటుగా గ్రామంలోని నిరుపేద మహిళలకు చీరల పంపిణీ, విద్యార్థులకు బట్టలు, విద్యా సామగ్రి పంపిణీ, వేసవి తాకిడి నుండి తమను తాము రక్షించుకునే విధంగా గ్రామ ప్రజలకు అవగాహన కల్గిస్తూ సమాజానికి సేవ చేస్తూ, రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహిస్తూ మా పాఠశాలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన డాక్టర్ చీదరాల చెన్నయ్య మాస్టారు పెనుబల్లి పాఠశాలలో విధులు నిర్వహించడం మాకెంతో ఆనందంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ అనంత కృష్ణ,వెటర్నరీ డాక్టర్ ఆర్. శ్రీనివాసులు,మాజీ సర్పంచ్ గెండి రఘురామయ్య,గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణక్రాక సర్పంచ్ సుధాకర్ సేవలు ప్రశంసనీయం

**సర్పంచ్ సుధాకర్, ఉపసర్పంచ్ మాల్యాద్రి రెడ్డి లను అభినందించిన కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి**




కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 2 జలదంకి మండలం లోని బ్రాహ్మణక్రాక పంచాయితీ సర్పంచ్ ఇండ్ల సుధాకర్ ప్రజలకు అందించిన సేవలు అమోఘం అని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం బ్రాహ్మణక్రాక లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ సుధాకర్, ఉప సర్పంచ్ దగుమాటి మాల్యాద్రి రెడ్డి, వార్డు సభ్యులు అందరి సహకారంతో బ్రాహ్మణక్రాక పంచాయితీలో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన సర్పంచుల సేవలు మరువలేనివని అన్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ఘనంగా సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు చేసిన సేవలు అభినందనీయమన్నారు. గ్రామాల్లో ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు ఇలా ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. నిస్వార్థంతో సేవలందించిన ప్రజాప్రతినిధులుగా సర్పంచ్ చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణక్రాక సర్పంచ్ ఇండ్ల సుధాకర్, ఉపసర్పంచ్ దగుమాటి మాల్యాద్రి రెడ్డి, టిడిపి నాయకులు మేకల శ్రీనాథ్ రెడ్డి, వేలమూరి పాండురంగ రెడ్డి, మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రుల ప్రజా రాజధాని అమరావతికి ఇక తిరుగులేదు



పలమనేరు,పెన్ పవర్, ఏప్రిల్ 02, ఆంధ్రరాష్ట్ర ప్రజల ప్రజా రాజధాని అమరావతికి ఇక తిరుగులేదని గంగవరం మండల టీడీపీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్ స్పష్టం చేశారు.కేంద్రంలో అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ప్రకటిస్తూ గెజిట్ విడుదలకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుసుకున్న టీడీపీ నాయకులు గురువారం మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించి,టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా సోమశేఖర్ గౌడ్ మాట్లాడుతూ..గత వైసీపీ ప్రభుత్వం మనకు రాజధాని అమరావతి కాదని, మూడు రాజధానులు ప్రకటించి,చివరకు రాజధాని అనేదే లేకుండా చేసిందని ధ్వజమెత్తారు.కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన రెండు సంవత్సరాల లోపే కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రం లోని టీడీపీ, జనసేన సహకారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ,ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంయుక్త నిర్ణయంతో ఆంధ్రుల కలల రాజధాని అమరావతి ఏర్పాటుకు మార్గం సుగమమైందని,ఇది 5కోట్ల మంది తెలుగు ప్రజల విజయం అన్నారు.జనసేన నాయకులు చందు మాట్లాడుతూ..రాష్ట్ర అభివృద్ధి కోసమే పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వంతో కలిసి నడుస్తున్నారని,ఇంకా మరో 20సంవత్సరాల వరకూ కలిసే ఉంటామని,

రాజధాని అమరావతి ఏర్పాటుతో ఇక అంతా విజయమే నని అన్నారు. ఇందులో సింగిల్ విండో అధ్యక్షులు ప్రసాద్ నాయుడు,నాయకులు ప్రతాప్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు,మాజీ సర్పంచ్ మురళి,సతీష్ నాయుడు,బాలాజీ,తాజ్ రెడ్డి,రవి,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పీ -4 పథకంలో భాగస్వామిని అవుతా

## జలదంకి మండలాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తా

## కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి

కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 2 పీ -4 పథకంలో భాగస్వామ్యమై జలదంకి మండలాన్ని దత్తత తీసుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు. వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బ్రాహ్మణక్రాక టిడిపి కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ -4 ( ప్రభుత్వ- ప్రైవేట్ - ప్రజల భాగస్వామ్యం) పథకం ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలవాలని, ఆ కుటుంబాలను దత్తత తీసుకొని బంగారు కుటుంబాలుగా వారిని తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు వివరించారు కుటుంబాలు ఆర్థికంగా సామాజికపరంగా చైతన్యవంతులయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్ లు పీ -4 పథకం తో పాటు పలు విద్యాసంస్కరణలను ప్రవేశపెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. వారి స్ఫూర్తితో పీ -4 పథకంలో భాగస్వామిని అయి జలదంకి మండలంలో పేద కుటుంబాలను దత్తత తీసుకొని వారికి అండగా నిలబడతానని తెలిపారు. త్వరలో మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల్లో 13 మంది విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ, ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, మండలంలో మూడు చోట్ల స్కిల్ సెంటర్లు ఏర్పాటుకు శ్రీకారం చుడతామన్నారు అన్ని అభివృద్ధి కార్యక్రమాలను సొంత నిధులతో వంటేరు వరదారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరఫున చేపడుతామని తెలిపారు. ముఖ్యమంత్రి




చంద్రబాబు నాయుడు వింజమూరు పర్యటనను విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల స్వామి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మేకల శ్రీనాథ్ రెడ్డి, టిడిపి యువ నాయకుడు వంటేరు నందగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు దగ్గు మాటి మాల్యాద్రి రెడ్డి, వేలమూరి పాండురంగారెడ్డి, జి మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మండల అధ్యక్షుడు వైస్ చైర్పర్సన్

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 2. బుచ్చిరెడ్డిపాళెం రామాలయం వీధిలో రథోత్సవానికి వచ్చిన వ్యక్తి తాగిన మైకంలో పడి రక్త గాయానికి గురైన విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకని గాయపడిన వ్యక్తిని ఆంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించిన తెలుగుదేశం పార్టీ (బుచ్చినగరం) అధ్రక్షుడు గుత్తా శ్రీనివాసులు, బుచ్చినగర పంచాయితీ వైస్ ఛైర్పర్సన్ యరటపల్లి శివకుమార్ రెడ్డి



# పార్లమెంట్‌లో అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా ఆమోదించిన సందర్భంగా

సంగం పెన్ పవర్ ఏప్రిల్ 2. సంగం మండలంలో కూటమి నాయకులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హై వే నుంచి బస్ స్టాండ్ సెంటర్ వరకు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో ప్రాంతం మార్మోగించారు. అనంతరం బస్ స్టాండ్ సెంటర్ వద్ద బాణాసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అమరావతి రాజధాని ఆమోదం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు నెరవేరిన విజయమని పేర్కొన్నారు. రైతుల త్యాగాలు ఫలించిన ఈ నిర్ణయం చారిత్రాత్మకమని అభివర్ణించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ,సీఎం చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్



కళ్యాణ్ లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, సంగం సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు,సొసైటీ డైరెక్టర్ పిట్టు పట్టాభిరామిరెడ్డి,శ్రీనివాస చౌదరి,శ్రీనివాసులు నాయుడు,ఉక్కాల శ్రీనివాసులు, జనసేన నాయకులు భాస్కర్ , ఆనంద్,మధన్ ,స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.. నా రాజధాని అమరావతి

## అమరావతి రైతులకు, ప్రజలకు నా సెల్యూట్

## నా రాజధాని అమరావతి అని గర్వపడేలా చేశారు





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 2. సీఎం వెంటే ఉన్నారు అనే దానికి ఇదే నిదర్శనం ప్రతి ఒక్కరూ సాయంత్రం రెండు దీపాలు వెలిగించండి ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు ప్రత్యేక ధన్యవాదాలు అమరావతికి మద్దతుగా భారీ ర్యాలీ.. తరలివచ్చిన ప్రజానీకం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం అమరావతి రాజధాని బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం లభించడం ప్రతి ఒక్కరికీ గర్వ కారణమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, నా రాజధాని అమరావతి అనేలా ప్రతి ఒక్కరూ ఉప్పొంగిపోయే విషయమన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మినగల్లులో బుచ్చిరెడ్డిపాలెం మండలం, మినగల్లు పంచాయతీ నందు, నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం, సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ప్రజలు, స్థానిక నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం అభివృద్ధి, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రజల కలల రాజధాని అమరావతిని సాకారం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సీఎం చంద్రబాబు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. 2014-19 మధ్య రాజధాని పనులు చేపడితే తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని పక్కన పడేసిందన్నారు. నాడు ప్రధాని మోడీని రాష్ట్రానికి తెచ్చి శంకుస్థాపన చేశారన్నారు. నేడు అదే రాజధానికి చట్టబద్ధత కల్పించి రాష్ట్ర ప్రజలను గర్వపడేలా చేశారన్నారు. దేశం మొత్తం అమరావతికి మద్దతుగా ఉంటే ఒక్క వైసీపీ మాత్రం వ్యతిరేకించి తమ బుద్ధి చూపిందని ఎద్దేవా చేశారు. ఇలాంటి నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని కూటమి ప్రభుత్వం నిరూపించిందని చెప్పారు. ఈ సందర్భంగా రైతుల కష్టాలను, వారి త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ రోజు సాయంత్రం రెండు దీపాలు వెలిగించి తమ సంఘీభావం తెలపాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 21 నెలల కాలంలో చేతల ప్రభుత్వం అని అభివృద్ధి చేసి నిరూపించుకున్నామన్నారు. ఎన్నికల చేసిన హామీలన్నీ అమలు చేస్తూ సంక్షేమ పథకాలను గడపకే చేర్చామన్నారు. ?కొత్త మినగల్లులో 15 లక్షల 60 వేలతో 3 సిసి రోడ్లు, ?పాత మినగల్లులో 10 లక్షలతో నిర్మించిన స్మశానవాటికకు వెళ్లే సిసి రోడ్డు ప్రారంభోత్సవాలు, 40 లక్షలతో వాటర్ పైప్‌లైన్ శంకుస్థాపన మొత్తం 65 లక్షల 60 వేలతో చేసుకుంటున్న అభివృద్ధి పనులే కూటమి ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నాయని చెప్పారు. 52 లక్షలతో కాలువల్లో పూడిక తీత చేపట్టామన్నారు. మినగల్లు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పాత పంచాయతీ కార్యాలయాన్ని గ్రామస్తుల అభ్యర్థన మేరకు 90 వేల రూపాయలు వెచ్చించి గ్రంథాలయంగా మార్చడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు పరిపాలన దక్షత, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పట్టుదల రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించాలన్న యువనేత, ఐటీ మరియు విద్యా శాఖ మంత్రి లోకేష్ కృషి చూస్తుంటే ఇలాంటి నాయకులు దొరకడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్నికార్యక్రమాలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# రావులపాడు సర్పంచ్ గెంజి. పెంచలమ్మకు ఘన సన్మానం...




పెళ్లకూరు, పెన్ పవర్, ఏప్రిల్ 2 పెళ్లకూరు మండలం రావులపాడు పంచాయతీ సర్పంచ్ గెంజి. పెంచలమ్మ పదవీ విరమణ సందర్భంగా సన్మానం నిర్వహించడం జరిగింది. ఆమె మాట్లాడుతూ రావులపాడు గ్రామస్తులకు సర్పంచ్ గా అవకాశం ఇచ్చినందుకు పాదాభివందనాలు అంటూ గత అనుభవాలను తెలియజేస్తూ గ్రామపంచాయతీ అభివృద్ధితోపాటు టెంకాయ తోపు నుండి రావులపాడుకు సిమెంట్ రోడ్డు, గ్రామంలో ప్రతి వీధికి సిసి రోడ్లు , నీటి వసతులు, గ్రామంలో ఎలాంటి అవాంఛనిక సంఘటనకు తావు లేకుండా ఒకవేళ జరిగిన గ్రామస్తులందరం ఏకతాటిపై నడవడం కల కలుపుకుపోవడం

కల్పించడం నాకు ఆ భగవంతుడు కల్పించిన గొప్ప వరంగా భావిస్తున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# 1 కోటి 15 లక్షలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్





నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 2. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్ ముత్యాలపాలెంలో 1, 2, 12, 17 మరియు 19 డివిజన్లలో 1 కోటి 15 లక్షల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.నా లక్ష్యం ఒక్కటే నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధే. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. నిత్యం ప్రజల్లోన్నే ఉంటాం. కూటమి ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకొని వెళ్తాము. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. నెల్లూరు జిల్లా తెలుగుదేశం నేతలందరం ఒక్కతాటిపై ఉంటాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.నిన్న జగన్ మోహన్ రెడ్డి మాట్లాడిన మాటలు చూసి పిల్లలు సైతం నవ్వుకుంటున్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నెల్లూరు రూరల్ లో జరిగే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు జిల్లాలో ఉండే శాసనసభ్యులను పిలిచి ఒక మంచి సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్. శ్రీధర్ అన్న ప్రజలతో మమేకమయ్యే తీరు అద్భుతం. నాయకులకు ఉండాల్సిన లక్షణాలు అన్నీ శ్రీధర్ అన్నకు ఉన్నాయి. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు, కో క్లస్టర్ ఇంచార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ, జనసేన , బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని పార్లమెంట్ ఆమోదించడంపై

ఆత్మకూరు పెన్ పవర్ ఏప్రిల్ 2. జనసేన పార్టీ హర్షం వ్యక్తపరిచారు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ కు అమరావతి రాజధానిగా ప్రకటిస్తూ పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం వ్యక్తం చేయడంపై జనసేన పార్టీ ఆత్మకూరు నియోజకవర్గం ఇన్చార్జ్ నలిశెట్టి.శ్రీధర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తపరుస్తూ నినాదాలు చేశారు.... ఆత్మకూరులోని వారి పార్టీ కార్యాలయంలో నేడు నిర్వహించిన సభలో నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీధర్ మాట్లాడుతూ తమ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పిన మాట ప్రకారము ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని ఆమోదిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయాన్ని భారత ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ ఉభయ సభలో ఆమోదింప చేయడం చాలా సంతోషకరమని అన్నారు.. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించేందుకు ప్రతిపక్ష నేత జగన్మోహన్రెడ్డి పన్నిన ఎన్నో కుయుక్తులను అధిగమించి అమరావతిని రాజధానిగా సాధించడం ఇది రాష్ట్ర ప్రజల విజయంగా తెలిపారు.. ఈ కార్యక్రమంలో వీరితోపాటు




జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు పేమల.సురేంద్ర, పార్టీ నేతలు గడ్డం వంశీ, పాటి. రాఘవ, నాగరాజు యాదవ్, మదన్ యాదవ్, మావిళ్ళ.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి రాజధాని రాజ్యసభలో చరిత్రాత్మిక చరిత్ర తీర్మానం..

## ముమ్మారెడ్డి గుంట పంచాయతీలో మెరుమ్. చంద్ర విజయోత్సవ ర్యాలీ...



పెళ్లకూరు, పెన్ పవర్, ఏప్రిల్ 02అమరావతికి పట్టిన గ్రహణం వీడింది. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ విభజన చట్టానికి సవరణ చేసే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. ఈ శుభ సందర్భంగా... ఈరోజు పెళ్లకూరు మండల పరిధిలోని ముమ్మారెడ్డి గుంట పంచాయతీలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం టిడిపి సీనియర్ నాయకుడు మెరూమ్. చంద్ర ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలతో జరపడం జరిగింది.

# కోదండ రామస్వామి వారి రథోత్సవంలో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 2.నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలో శ్రీ కోదండ రామస్వామి వారి శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్వామివారి రథోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ పవిత్ర వేడుకలో కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతమ్మ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై శ్రీరామ్ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారు మ్రోగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ, శ్రీ కోదండ రామస్వామి వారి ఆశీస్సులతో కోవూరు ప్రజలందరికీ ఆయురారోగ్యాలు,



సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు. భక్తులతో కలిసి రథాన్ని లాగుతూ ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని పంచుకున్నారు. రథోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారికి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిందని ఆమె తెలిపారు.

# కోట్లాది రూపాయలతో వి.కోట పంచాయతీని అభివృద్ధి చేశా! సర్పంచ్ పిఎన్.లక్ష్మీ స్పష్టం



పలమనేరు,పెన్ పవర్, ఏప్రిల్ 02, చిత్తూరు జిల్లాలోనే ఎక్కడా లేనివిధంగా కోట్లాది రూపాయలతో వి.కోట పంచాయతీని అభివృద్ధి చేశానని సర్పంచ్ లక్ష్మీ స్పష్టం చేశారు.గురువారంతో సర్పంచ్ పదవీకాలం చివరి రోజు కావడంతో పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశం నందు అధికారంలోకి వచ్చినప్పటి నుండీ ఇప్పటివరకూ చేపట్టిన అభివృద్ధితో బాటు పలు విజయాలను ఆమె మీడియాకు వివరించారు. వి.కోట.ప్రజల ఆశీర్వాదంతో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా 2021వ సంవత్సరం ఫిబ్రవరి 17వ తేదీన బాధ్యతలు స్వీకరించానన్నారు. అప్పటికే గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారుల పాలనలో సిబ్బందికి సైతం కనీసం జీతభత్యాలు చెల్లించలేని దుస్థితిలో ఉంది.ఎన్నికలలో ప్రజలు నాపై నమ్మకం ఉంచి,రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీగా గెలిపించారు. అప్పటినుండి నేటి వరకు ప్రత్యేక ప్రణాళికతో గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో నడుపుకుంటూ వచ్చాను.ప్రజలు అందించిన ఈ పదవి నేటితో ముగిసింది.కాగా ఈ ఐదేళ్ల పాలనలో గ్రామపంచాయతీ పరిధిలో నేను చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు.. పదవి బాధ్యతలు స్వీకరించిన వెంటనే మీ ఊరికి మీ సర్పంచ్ కార్యక్రమం ద్వారా ప్రతి పల్లెకు ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకొని,వాటిని పరిష్కరించి కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాను. గ్రామపంచాయతీ కార్యాలయంలో పనుల కోసం వచ్చేవారికి ఫిర్యాదుల రిజిస్టర్ ఏర్పాటు చేసి అందులో నమోదైన ప్రతి సమస్యను 24 గంటల్లో పరిష్కరించడం జరిగింది.అవినీతికి తావు లేకుండా వారి పనులను సత్వరం పరిష్కరించాను. దశాబ్దాలుగా హైకోర్టు కేసులతో అభివృద్ధికి నోచుకోని పంచాయతీ బస్టాండును అక్కడ దుకాణదారులతో చర్చించి కొత్త షాపులు నిర్మించి వారికే కేటాయిస్తానని హామీ ఇచ్చి డాక్టర్ వైఎస్ఆర్ కాంప్లెక్స్ నిర్మించి ప్రయాణికులకు శాశ్వత షెడ్లు ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొచ్చా.ఈ కాంప్లెక్స్ పట్టణానికే తలమానికంగా నిలిచింది,మరియు సెంట్రల్ బస్టాండ్ నందు కూడా డాక్టర్ వైఎస్ఆర్ కమర్షియల్ కాంప్లెక్స్ టు మరియు త్రీ పక్కా భవనాలు నిర్మించి దుకాణదారులకు అందుబాటులో తీసుకొచ్చాను. పట్టణంలోని హిందూ స్మశాన వాటికలో సిమెంట్ రోడ్లు,స్నానపు గదులు నిర్మించి అక్కడ వీధిదీపాలు ఏర్పాటు చేస్తే ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాను. అలాగే ఎవరైనా మృతి చెందితే అవసరమైన ఫ్రీజర్ బాక్స్ను ఉచితంగా అందుబాటులో ఉంచడం జరిగింది. అలాగే ముస్లిం స్మశాన వాటికలో సిమెంట్ రోడ్లు వీధిదీపాలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి బారిన పడిన బాధితులకు, పంచాయతీ కార్మికులకు నిత్యావసర సరుకులు, శానిటైజర్ కిట్లు అందించాను.క్వారంటయిన్ టైంలోని బాధితులకు భోజనం మందులు అందించడం జరిగింది. కరోనాతో మృతి చెందిన వారి వద్దకు కుటుంబ సభ్యులు రాకపోయినా వారికి మేమే అంత్యక్రియలు నిర్వహించడం అలాగే వారికి ఆర్థిక సహాయం చేసి ఆదుకోవడం జరిగింది.నేను సర్పంచ్ గా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే కాజీపేటలో సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాము.చివరగా కరేపల్లి గ్రామం వరకు సిసి రోడ్లు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ ఐదేళ్ల కాలంలో 6 కోట్ల వ్యయంతో 14వేల మీటర్ల సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాను. పారిశుద్ధ్య పనులకు పెద్దపీట వేస్తూ మురుగునీరు కనిపించకుండా సుమారు మూడు కోట్ల వ్యయంతో 5వేల మీటర్ల సిసిరోడ్లు డ్రైన్ ఏర్పాటు చేయడం జరిగింది.పట్టణంలో దుర్గానగర్ రోడ్ పై ప్రవహిస్తున్న మురుగునీటి ప్రవాహాన్ని పరిశీలించి అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో జాతీయ రహదారిని అధికారులతో చర్చించి రోడ్డుకు ఇరువైపులా డ్రైన్ నిర్మాణం చేపట్టే బటర్ఫ్లై ఏర్పాటు చేసి పట్టణాలతో పోటీపడే విధంగా ఆధునికరించాను. చీకట్లో మగ్గుతున్న మేజర్ పంచాయతీ కేంద్రాన్ని జిల్లాలో ఎక్కడా లేనివిధంగా హైమాస్ లైట్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టాను,మొదట వైఎస్ఆర్ సర్కిల్ ఆపై అంబేద్కర్ సర్కిల్ ల్లో హైమాస్ కాంతులతో పట్టణానికి వెలుగులు నింపాను,ఆపై వాడవాడలా పల్లెల్లో గ్రామపంచాయతీ పరిధిలో అవసరమైన ప్రతి చోట హైమాస్ లైట్లు ఏర్పాటు చేసి ఎల్ఇడీ వెలుగులు అందుబాటులోకి తీసుకొచ్చాను. పంచాయతీ పరిధిలో త్రాగునీటికే ట్యాంకర్ల సరఫరాపై ఆధారపడి ప్రజలు అనుభవిస్తున్న కష్టాలను గుర్తించి తాగునీటి సమస్యకు అధిక ప్రాధాన్యం కల్పించి వెంటనే అవసరం ఉన్న చోట బోర్లు వేయించి పైప్ లైన్లు ఏర్పాటు చేశాను. నూతనంగా వాటర్ మెన్లను ఏర్పాటు చేసి ప్రతిరోజు ప్రతి కుటుంబానికి మంచినీరు అందేలా చర్యలు తీసుకున్నాను. ప్రస్తుత గ్రామ పంచాయతీ పరిధిలో ఎలాంటి నీటి కొరతా లేని విధంగా తీర్చిదిద్దాను. పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస సౌకర్యాలు లేక ఉద్యోగులకు తరిగినంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో నూతన గ్రామ సచివాలయం ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాను. పట్టణంలో అభివృద్ధికి నోచుకోక ఎగువ చెక్పోస్ట్,దిగువ చెక్పోస్ట్ అని పిలవబడే వాటిని అంబేద్కర్ కూడలి వైయస్సార్ కూడలిలుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాను పట్టణంలోని వీధులను గుర్తించేందుకు వీధులుగా దాతల సహకారంతో పాటు వీధులకు నేమ్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు లాంగ్ బజారుగా ఉన్న పేరును మార్పు చేసి ఎం.జి.రోడ్డుగా నామకరణం చేయడం జరిగింది.తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రం తరలించేందుకు గ్రీన్ అంబాజిడర్లను నియమించి పట్టణంలో ఎక్కడా దిబ్బలు కనబడకుండా చేశాను. చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నిర్వహణకు గాను రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ- స్వర్ణాంధ్ర రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు తీసుకున్నాను. గాండ్లపల్లి గ్రామ సమీపంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు స్థలం సేకరించి అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.పంచాయతీ పరిధిలో పారిశుద్ధ లోపంతో జబ్బులు వచ్చే ప్రమాదం ఉన్న స్థలాలను గుర్తించి దోమలు ద్వారా అంటూ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రతినిత్యం సానిటేషన్ దోమల నివారణకు క్రమం తప్పకుండా పాకింగ్ పనులు చేపట్టారు. పంచాయతీ అభివృద్ధి కోరి మా మీద నమ్మకంతో అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటాను ఈ ఐదేళ్లు నిస్వార్థంగా మీ అంచనాలకు అనుగుణంగా నిరంతరాయంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు భవిష్యత్తులో పరిస్థితులు అనుకూలిస్తే యధా ప్రకారం అభివృద్ధిని కొనసాగించగలను. ప్రజలు నాకు అప్పగించిన పదవిని బాధ్యతగా నిర్వర్తించాను. ఈ ఐదేళ్లు నాకు సహకరించిన పాలకవర్గానికి అధికారులకు మా వెంట నడిచిన ఆత్మీయులకు మరియు ఎన్నుకున్న ప్రజలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఇందులో వి.కోట పంచాయతీఅభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన సర్పంచ్ తనయులు పి.యన్.నాగరాజ్,ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఈఓ.నరేష్,మాజీ ఈఓ యాధవపతి,జెపి.రామచంద్ర,వార్డ్ అర్.డబ్ల్యు, ఈ.ఓ.మెంబర్లు, పంచాయతీ కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

# అమరావతికి చట్టబద్ధత కల్పించడం వేడుకలు.. ఎంపీడీవో కార్యాలయంలో సంబరాలు..



పెళ్లకూరు, పెన్ పవర్, ఏప్రిల్ 02 ప్రజల కలల రాజధాని అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంట్ లో చట్టం చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గురువారంరాత్రి ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ హరికృష్ణ,

ఎంపీడీవో ప్రమీలరాణి, ఏవోఅన్నపూర్ణ రావు , తెలుగుదేశం పార్టీ నాయకులు సంచి కృష్ణయ్య, కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్ రెడ్డి, మదన్ మోహన్ నాయుడు, మునీష్ , సిద్దులయ్య, సత్యంరాజు, నరేంద్ర యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అసెంబ్లీలో చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకొని, అమరావతిని శాశ్వత రాజధానిగా తీర్మానం చేసి కేంద్రానికి పంపడం జరిగిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం అమరావతిని ఆంధ్రప్రదేశ్ కు శాశ్వత రాజధానిగా ప్రకటిస్తూ లోక్ సభ,రాజ్యసభల్లోబిల్లుఆమోదంపొందడం అభినందనీయమన్నారు.

# వేసవికాలం సమీపిస్తూ ఉండడంతో ప్రజలను ఉద్దేశించి పలు సూచనలు.. ఈస్ట్ సబ్ డివిజన్ డిఎస్పి అబ్దుల్ అజీజ్.



గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 02. వేసవి ఉక్క పోతతో ప్రజలు ఆరుబయట మరియు ఇంటి డాబాపై నిద్రిస్తూ ఉంటారు అలాంటివారు ఇంటి తలుపులు జాగ్రత్తగా వేసుకోవాలి... బంగారం,వెండి యొక్క విలువ రోజురోజుకీ పెరగడంతో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు... వేసవి సెలవులకు ప్రజలు ఎవరైనా ఊరు వెళ్ళేటప్పుడు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో సమాచారము ఇచ్చినట్లయితే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం... ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నట్లయితే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవలన్నారు... ప్రతి ఒక్కరూ ఇంటి ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని..ఒంటరి మహిళలు ప్రయాణించేటప్పుడు ఒంటిపై బంగారాన్ని తీసుకువెళ్లకపోవడమే మంచిదని..డిఎస్పి పేర్కొన్నారు...

# రైతులకు సమస్యలు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్





పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 2: రైతులకు సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు గురువారం మధ్యాహ్నం రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని వేమూరు మండలం,బలిజే పల్లి గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా రీ సర్వే పూర్తి చేయాలని తహశీల్దార్ ను ఆదేశించారు.బలిజే పల్లి గ్రామం పరిధిలోని భూముల రీ సర్వే అంత పూర్తి చేశారా ఇంకా పెండింగా ఉందని వి ఆర్ ఓ ను వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది , బలిజే పల్లి గ్రామంలోని వి.సాంబశివరావు యం.ఆంజనేయులు రైతుల కు సంబంధించి వి ఆర్ ఓ మొబైల్ యాప్ ద్వారా రీ సర్వ పూర్తి అయిన వివరాలను కలెక్టర్ కు వివరించారు. మీకు కొత్త పట్టదార్ పాస్ బుక్ వచ్చిందా,అందులో అన్నియు సంక్రాంగా ఉన్నాయని,మీ భూమికి సంబంధించి తగ్గిందా లేదా పెరిగిందా అంత సంక్రాంగా ఉందా ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా,రీ సర్వేకి సంబంధించి తహశీల్దార్, వి ఆర్ ఓ,సర్వేయర్ కు ఏమైనా డబ్బులు ఇచ్చారని, మీ గ్రామంలో ఏమైనా.సమస్యలు ఉన్నాయా,తాగు,సాగునీరు కు సంబంధించి సమస్యలు ఉన్నాయాని మీకు ఏమైనా సస్యలు ఉంటే చెప్పండిని రైతులను జిల్లా కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ రీ సర్వే వల్ల మాకు మంచి జరిగిందని,మా భూమికి సంబంధించి మ్యాప్ తో సహా సరిహద్దులు గుర్తించడం జరిగిందని, పాస్ బుక్ లో అన్ని వివరాలు క్లియరగా ఉందని,మేము ఎవ్వరికి ఒక్క పైసా డబ్బులు ఇవ్వలేదని,మా గ్రామానికి సంబంధించి తాగునీటి సమస్యలేదని, వ్యవసాయానికి 30 అడుగులలో బోర్లు లో నీరు వస్తుందని రైతులు కలెక్టర్ కు తెలియజేసారు. ఆధార్ కార్డు లేదని ఒక పెద్దావిడ జిల్లా కలెక్టర్ గారికి విన్నవించుకోగా కొత్త ఆధార్ కార్డు చేయించాలని డిజిటల్ అసిస్టెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బి.శ్రీదేవి,తహశీల్దార్ బి.సుశీల, వి ఆర్ ఓ లు,సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బౌద్ధ పుణ్యక్షేత్రమైన చారిత్రాత్మక అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్:



పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 2: అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటించడంపై స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా వేడుకలు జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. విద్యార్థులకు తినిపించారు. అనంతరం కలెక్టర్ కు విద్యార్థులు కేకు తినిపించారు. విద్యార్థులతో కలిసి గాలిలోకి బెలూన్ లను ఎగరవేశారు. వేడుకల నేపథ్యంలో విద్యార్థులంతా ముక్తకంఠంతో రాజధాని అమరావతికి జై,... జై జై అమరావతి అంటూ.. నినదించారు. ప్లకార్డులను చేతబూని విద్యార్థులంతా ఆంధ్ర ప్రజల కలల రాజధాని అమరావతి అంటూ నినాదాలు చేశారు. ప్రజల రాజధానిగా అమరావతిని ప్రకటించడం చారిత్రాత్మక ఘట్టం అని కలెక్టర్ చెప్పారు. ప్రజల కలలు నేడు నెరవేరాయన్నారు. దేశ రాజధానిగా ఢిల్లీ చరిత్రలో ఎలా ఉందో, అదే మాదిరిగా బౌద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుం దన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అసెంబ్లీలో చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. అసెంబ్లీలో ఎంతో ధైర్యంగా అమరావతిని రాజధానిగా ప్రకటించడం, తీర్మానించడం, కేంద్రానికి పంపడం సాహసోపేతమైన నిర్ణయంగా అభివర్ణించారు. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని ఆంధ్రప్రదేశ్ కు రాజధానిగా ప్రకటిస్తూ అధికారికంగా కేంద్రం ఆమోదించడం అభినందనీయమన్నారు. అమరావతి ఎకనామిక్ జోన్ లో బాపట్ల జిల్లా ఉండడం సంతోషదాయకమన్నారు. అలాగే సి ఆర్ డి పరిధిలోనూ జిల్లాలోని ఒక నియోజకవర్గం ఉందని, తద్వారా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రాష్ట్ర రాజధాని ప్రకటించడంపై ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్ సింగ్, జిల్లా క్రీడ ప్రాధికార సంస్థ అధికారి శ్రీనివాస్, సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర సలహాదారులు రాంకమల్, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి విజయకేతనం బాపట్లలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ





పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 2: ఆంధ్రప్రదేశ్ జీవనాడి, మన రాజధాని అమరావతికి పార్లమెంట్ వేదికగా చట్టబద్ధమైన ఆమోదం లభించడం ఐదు కోట్ల ఆంధ్రుల చారిత్రాత్మక విజయమని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు కొనియాడారు అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా నిర్ణయిస్తూ, చట్టబద్ధమైన ఆమోదం లభించిన చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని బాపట్ల పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆధ్వర్యంలో ఈరోజు భారీ విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చీలు రోడ్డు నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ, జై అమరావతి నినాదాలతో హోరెత్తింది. వందలాదిమంది కార్యకర్తలు, ప్రజలతో కలిసి జమ్ములపాలెం ఫ్లైఓవర్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ఎమ్మెల్యే బైక్ ర్యాలిగా సాగారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ హర్షం వ్యక్తం చేశారు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారా ఈ రోజు అమరావతికి శాశ్వత చట్టబద్ధత లభించడం గర్వకారణం. ఇది అన్యాయంపై ధర్మం సాధించిన విజయం. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దాలన్నది మన ప్రియతమ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అకుంఠిత దీక్ష గత ఐదేళ్లుగా ఎన్ని కుట్రలు జరిగినా, ఎన్ని అవమానాలు ఎదురైనా ఆయన వెనకడుగు వేయలేదు.కేంద్రంతో ఆయన జరిపిన సంప్రదింపుల వల్లే ఈరోజు పార్లమెంట్ సాక్షిగా అమరావతికి ఈ గౌరవం దక్కింది. ఆధునిక ఆంధ్రప్రదేశ్ నిర్మాతగా ఆయన పేరు చరిత్రలో నిలిచిపోతుంది.ప్రపంచ పటంలో ఆంధ్రప్రదేశ్ పేరును నిలబెట్టేందుకు చంద్రబాబు కన్న కల ఈ అమరావతి. గత ఐదేళ్లుగా ఎన్ని అవమానాలు ఎదురైనా, ఢిల్లీ స్థాయిలో పోరాడి, కేంద్ర ప్రభుత్వ మద్దతును కూడగట్టి, పార్లమెంట్ సాక్షిగా అమరావతికి చట్టబద్ధత తీసుకువచ్చిన ధీశాలి ఆయన. ఆయన దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్ర భవిష్యత్తు సురక్షితమైంది. మన యువ నాయకులు నారా లోకేష్ రాజధాని కోసం చేసిన పోరాటం మరువలేనిది. రాజధాని రైతులు, మహిళలు రోడ్డున పడి ఇబ్బందులు పడుతున్నప్పుడు వారికి అండగా నిలబడి, తన 'యువగళం' ద్వారా అమరావతి ఆకాంక్షను దేశవ్యాప్తం చేశారు. యువత భవిష్యత్తు రాజధానితోనే ముడిపడి ఉందని ఆయన నిరూపించారు. బాపట్ల నియోజకవర్గ ప్రజల తరపున మన నేతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాశ్ నారాయణ, బాపట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రపంచశాంతి కోసం రేపు గుంటూరు నగరంలో రన్ ఫర్ జీసస్ సమైక్య శాంతి ర్యాలీ.

పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 2: మరణాన్ని జయించి సమాధి నుండి తిరిగి లేచిన యేసు క్రీస్తు పునరుద్దానా ( ఈస్టర్ ) పండుగను పురస్కరించుకొని గుంటూరు నగరంలో శనివారం ఉదయం 6:00 గంటలకు వెస్ట్ పారిస్ చర్చి నుండి రన్ ఫర్ జీసస్, సమైక్య శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ పాస్టర్ గనుపల్లి సతీష్ బాబు తెలియజేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాస్టర్ సతీష్ బాబు మాట్లాడుతూ ఆరాధన టీవీ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ కార్యక్రమము గుడ్ ఫ్రైడే మరుసటి రోజు శనివారం అనేక ప్రాంతంలో నిర్వహించబడుతుందని గుంటూరు పట్టణ క్రైస్తవ సంఘాలు ఐక్యంగా ప్రపంచ శాంతి కోసం ప్రజల మధ్య సౌభ్రాతృత్వం కోసం ఈ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 6:00 గంటలకు రమేష్ హాస్పిటల్ వెస్ట్ ప్యారిస్ చర్చి నుండి ప్రారంభమై మూడు బొమ్మల సెంటర్, కలెక్టరేట్, స్తంభాల గురువు, పట్టాభిపురం, ఎన్టీఆర్ స్టేడియం, లక్ష్మీపురం మీదుగా లాడ్జి సెంటర్ లోని ఏ.ఈ.ఎల్.సి బీఈడీ కాలేజీ వరకు కొనసాగుతుందని గుంటూరు పరిసర ప్రాంత క్రైస్తవులు క్రైస్తవ విశ్వాసులు ఈ రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఆటిజాన్ని అర్థం చేసుకుందాం..

## ఆత్మీయతను పంచుదాం... కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..





విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 02, ఆటిజాన్ని సరైన విధంగా అర్థం చేసుకొని.. చిన్నారులకు ఆత్మీయత పంచుదామని, ప్రతి వ్యక్తికి ప్రత్యేకమైన సామర్థ్యాలు ఉంటాయని, ఆ ప్రత్యేకతలను గుర్తించి ప్రోత్సహిస్తే వారు జీవితంలో మెరుగైన స్థాయికి చేరుకుంటారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే సందర్భంగా గురువారం నగరంలోని అయోధ్యనగర్‌లో గల చేయూత మానసిక దివ్యాంగుల శిక్షణ సంస్థలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌పై జరిగిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హాజరయ్యారు. చిన్నారుల క్షేమసమాచారాన్ని, వారి ప్రత్యేక అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆటిజం అనేది లోపం కాదని, అది ఒక ప్రత్యేకమైన స్థితి మాత్రమేనని, సరైన శిక్షణ, మద్దతు ఉంటే వారు కూడా సమాజంలో సమానంగా ఎదగగలరని తెలిపారు. ఆటిజం ఉన్నవారి అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని.. అదేవిధంగా 20 ఏళ్లుగా చేయూత డైరెక్టర్ డా. టి.కృష్ణకుమారి చేస్తున్న కృషి ప్రశంసనీయమైనదని పేర్కొన్నారు. ఆటిజం చిన్నారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో పాటు క్రీడలు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, స్విమ్మింగ్ తదితరాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు.

చేయూత పిల్లల కళాత్మక ప్రదర్శనలు, వేస్ట్ మెటీరియల్, న్యూస్ పేపర్లతో చేసిన గిఫ్ట్ ఐటెమ్స్‌ను పరిశీలించి ప్రతిభను ప్రోత్సహించారు. చిన్నారులకు ఇచ్చే ప్రత్యేక శిక్షణ విషయంలో అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తామని డా. కృష్ణకుమారికి తెలిపారు....

# ఆటిజమ్ సెంటర్ ను త్వరగా ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్:





పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల 2:సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆటిజమ్ సెంటర్, భవిత సెంటర్లను కలెక్టర్ గురువారం పరిశీలించారు విభిన్న ప్రతిభావంతులైన వారికి జీవన నైపుణ్యాలు, వైద్యం, విద్యాబుద్ధులు నేర్పేలా ఆటిజమ్ సెంటర్ ఉపకరిస్తుందని కలెక్టర్ చెప్పారు. విభిన్న ప్రతిభావంతులైన మతిస్థిమితం లేని వారు జిల్లాలో 3,394 మంది ఉన్నారన్నారు. ఆటిజమ్ తో బాధపడేవారు 79 మంది ఉన్నారన్నారు. వారందరికీ విద్యాబుద్ధులు నేర్పడం, అవసరమైన వైద్యం అందించడం, వారి జీవన నైపుణ్యాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిందన్నారు. ఈ కేంద్రాలను త్వరలో ప్రారంభించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలతో వీటిని ఏర్పాటు చేయాలని ఆయన పలు సూచనలు చేశారు. ఆటిజమ్ తో బాధపడే వారి తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సామాజిక మరుగుదొడ్లను కలెక్టర్ పరిశీలించారు. స్వచ్ఛ ఆంధ్ర నిధులు, డి ఎం ఎఫ్ నిధులతో నిర్మించిన సామాజిక మరుగుదొడ్ల భవన సముదాయాన్ని ఆయన పరిశీలించారు. త్వరలో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు.

కలెక్టరేట్ కు వచ్చే ప్రజల సౌకర్యార్థం సామాజిక మరుగుదొడ్లు తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ సింగ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి శ్రీనివాస్, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు, సమగ్ర శిక్ష అభియాన్ సలహాదారులు రాంకమల్, విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఆంధ్రప్రదేశ్ గా నిలిచి అమరావతిని గెలిచి

## రాజధాని ప్రాంతానికి తరలి వెళ్లిన మండల నాయకులు ...మండల వ్యాప్తంగా సంబరాలు



బెల్లంకొండ ఏప్రిల్ 2 పెన్ పవర్ అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటించడంపై మండల నాయకులు గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు నాయకులందరూ ముక్తకంఠంతో రాజధాని అమరావతికి జై,... జై జై అమరావతి అంటూ.. నినదించారు. ప్లకార్డులను చేతబూని ఆంధ్ర ప్రజల కలల రాజధాని అమరావతి అంటూ నినాదాలు చేశారు. ప్రజల రాజధానిగా అమరావతిని ప్రకటించడం చారిత్రాత్మక ఘట్టం అని మండల నాయకులు చెప్పారు. ప్రజల కలలు నేడు నెరవేరాయన్నారు. దేశ రాజధానిగా ఢిల్లీ చరిత్రలో ఎలా ఉందో, అదే మాదిరిగా బౌద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అసెంబ్లీలో చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. అసెంబ్లీలో ఎంతో ధైర్యంగా అమరావతిని రాజధానిగా ప్రకటించడం, తీర్మానించడం, కేంద్రానికి పంపడం సాహసోపేతమైన నిర్ణయంగా అభివర్ణించారు. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని ఆంధ్రప్రదేశ్ కు రాజధానిగా ప్రకటిస్తూ అధికారికంగా కేంద్రం ఆమోదించడం అభినందనీయమన్నారు. అలాగే సి ఆర్ డి పరిధిలోనూ జిల్లాలోని ఒక నియోజకవర్గం ఉందని, తద్వారా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రాష్ట్ర రాజధాని ప్రకటించడంపై ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రజలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు




# గుర్తుతెలియని మహిళా మృతి...



పెళ్లకూరు, పెన్ పవర్, ఏప్రిల్ 02 పెళ్లకూరు మండల పరిధిలోని 71 వ జాతీయ రహదారి రోడ్డు పక్కన చంబడి పాలెం గ్రామ పొలాల్లో గుర్తుతెలియని మహిళ శవాన్ని గ్రామస్తుల సమాచారం ప్రకారం గురువారం రోజున సుమారు మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో పెళ్లకూరు ఎస్ ఐ. దారం ఆదిలక్ష్మి గుర్తించారు. మృతురాలి వయస్సు సుమారు45-55 సంవత్సరాలు, దుస్తుల రంగు మెరూన్ కలర్ నైటీ ఈ సమాచారాన్ని అందుకున్నవారు. వివరాలు మేరకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు పెళ్లకూరు ఎస్ఐ. 9440796367 నాయుడుపేట రూరల్ సీఐ 9440796356 తెలియపరచగలరని తెలియజేశారు.

# క్యాష్ కొట్టు క్యాస్ట్ సర్టిఫికెట్ పట్టు

## చల్లపల్లి రెవెన్యూ కార్యాలయంలో సర్టివికెట్ కొరకు అష్ట కష్టాలు పడుతున్న ప్రజలు ...పార్ట్ --1

పెన్ పవర్ చల్లపల్లి ఏప్రిల్ 02 వసూళ్ల దందా హద్దు మీరు తుంది. ఉన్నత విద్యకు వెళ్లాలన్న ఏమైనా ప్రభుత్వం నుండి రుణాలు పొందాలన్నా ప్రభుత్వ పథకాలను పొందాలన్నా కుల ధృవీకరణ పత్రం అవసరం ఈ సర్టిఫికెట్ రెవిన్యూ కార్యాలయం నుండి పొందవలసి ఉంది అందువలన ఆయా పథకాలను పొంది లబ్ధిదారులు రెవిన్యూ కార్యాలయంలో ముందుగా దరఖాస్తు చేసి అధికారుల విచారణ తర్వాత సర్టిఫికెట్ పొందుతారు కానీ చల్లపల్లి రెవిన్యూ కార్యాలయంలో ఆయా పథకాలను పొందేందుకు కుల ధృవీకరణ సర్టిఫికెట్ కొరకు దరఖాస్తు చేస్తే అష్ట కష్టాలు పడవలసిన పరిస్థితి ఏర్పడడమే కాకుండా వీఆర్వో రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షణాలు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది ఉదాహరణకు ఓ వ్యక్తి తన పిల్లల ఉన్నత చదువుల కొరకు కులతృవీకరణ కొరకు దరఖాస్తు చేసుకున్నాడు అందుకు సంబంధించిన సర్టిఫికెట్లు కూడా జతపరిచాడు కానీ రెవిన్యూ అధికారులకు మాత్రం ఆ సర్టిఫికెట్లు ఏమి కనిపించట్లేదు సవాలక్ష ప్రశ్నలతో విచారించి సర్టిఫికెట్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు కానీ సర్టిఫికెట్ కొరకు దరఖాస్తు చేసిన తండ్రి సర్టిఫికెట్ పొందడానికి ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితిలోకి నెట్టబడ్డాడు ఆఖరికి తెలిసింది ఒక్కో సర్టిఫికెట్ కు ఒక రేటు



నిర్ణయించారని అందులో భాగంగానే కుల ధృవీకరణ సర్టిఫికెట్ కు ఆ అధికారి చేతులు తడిపితే తప్ప సర్టిఫికెట్ చేతికి అందదు అని ఆ నోట ఆ నోట తెలిసి ఆ దిశగా ప్రయాణం చేస్తున్నట్లు తెలుస్తోంది ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి అత్యవసర కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కాలయాపన చేయకుండా దరఖాస్తుదారులకు సకాలంలో అందించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై అధికారులు ఎలా స్పందిస్తారు వేచి చూడాల్సిన అవసరం ఉంది

# చిలకలూరిపేట మున్సిపాలిటీ కీలక నిర్ణయం

## 38 నుంచి 48కి పెరిగిన వార్డుల సంఖ్య




చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 02: చిలకలూరిపేట: పట్టణ అభివృద్ధి మరియు పాలనా సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిలకలూరిపేట పురపాలక సంఘంలో వార్డుల సంఖ్యను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెరుగుతున్న ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా, ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా గతంలో ఉన్న 38 వార్డులను ఇప్పుడు 48కి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో జిల్లాలోనే అత్యధికంగా 48 మంది కౌన్సిల్ సభ్యులు కలిగిన ఏకైక మున్సిపాలిటీగా చిలకలూరిపేట సరికొత్త రికార్డును సృష్టించింది. వార్డుల సంఖ్య పెరగడంతో పాటు, మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల సంఖ్యను కూడా 3 నుంచి 4కు పెంచారు. ఈ మార్పుల వల్ల వార్డుల భౌగోళిక పరిధి తగ్గి, కౌన్సిలర్లు స్థానిక సమస్యలపై మరింత లోతుగా దృష్టి సారించే అవకాశం కలుగుతుంది. డ్రైనేజీ, రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "పెరిగిన జనాభా రీత్యా ప్రజల అవసరాలను తీర్చడానికి వార్డుల విభజన అనివార్యమైంది. ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు ఆమోదం పొందడం శుభపరిణామం. త్వరలోనే కొత్త వార్డుల సరిహద్దుల ఖరారు మరియు గెజిట్ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాం" అని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఈ కొత్తగా ఏర్పడిన 48 వార్డుల ప్రాతిపదికనే జరగనున్నాయి.

# ఎలైట్ ఎన్ క్లేవ్ శంకుస్థాపన

## పాల్గొన్న: ప్రత్తిపాటి వెంకట కుమారి

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 02: చిలకలూరిపేట : పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ప్రముఖ రియల్టర్ గుదే పాండురంగరావు సారధ్యంలో రూపుదిద్దుకుంటున్న హ్యాపీ హోమ్స్ డెవలపర్స్ వారి నూతన ప్రాజెక్ట్ 'ఎలైట్ ఎన్ క్లేవ్' శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకట కుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా జరిగిన భూమి పూజలో పాల్గొన్న అనంతరం, ఆమె ప్రాజెక్ట్ యొక్క అధికారిక బ్రౌచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట కుమారి మాట్లాడుతూ వినియోగదారుల నమ్మకానికి ప్రతీకగా నిలుస్తున్న గుదే పాండురంగరావు చిలకలూరిపేట ప్రజలకు మెరుగైన వసతులతో కూడిన నివాస స్థలాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు.



# వీరభద్ర స్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రత్తిపాటి వెంకట కుమారి

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 02: చిలకలూరిపేట: పట్టణంలోని కొమరవల్లిపాడు, పాటిమీద కొలువై ఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి ఆలయ 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానం మేరకు మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకట కుమారి విచ్చేశారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి, దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకట కుమారి మాట్లాడుతూ వీరభద్ర పళ్లెర మహోత్సవంలో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు



# హైదరాబాద్ కు రెండు విమాన సర్వీసులు

**విజయవాడ, ఏప్రిల్ 2, పెన్ పవర్:**
ఏపీ నుంచి కొత్తగా పలు విమాన సర్వీసులు ప్రారంభంకానున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌కు కనెక్టవిటీని పెంచేలా ఈ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. రాజమహేంద్రవరం నుంచి మూడు కొత్త సర్వీసులు ప్లాన్ చేయగా.. తాజాగా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు కొత్తగా మరో రెండు విమాన సర్వీసులు ప్రారంభించనున్నారు. ఈ నెల 10 నుంచి ఒక విమాన సర్వీసు, 17 నుంచి మరో సర్వీస్ అందుబాటులోకి రానుంది విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు రెండు కొత్త విమాన సర్వీసులు నడపనున్నట్లు విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ఈ నెల 10 నుంచి ఫ్లై-91 ఎయిర్‌లైన్స్ సంస్థ ఈ రెండు సర్వీసులు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ కొత్త విమాన సర్వీస్ హైదరాబాద్‌లో ఉదయం 6.05 గంటలకు బయల్దేరి ఉదయం 7.10 నిమిషాలకు విజయవాడ చేరుకుంటుంది అన్నారు. ఈ విమానం తిరుగు ప్రయాణంలో విజయవాడ నుంచి ఉదయం 07:30గంటలకు బయలుదేరి ఉదయం 08:40గంటలకు హైదరాబాద్‌కు వెళుతుందన్నారు.,ఈనెల 17 నుంచి ఫ్లై-91 ఎయిర్‌లైన్స్ సంస్థకు చెందిన మరో సర్వీసు హైదరాబాద్-విజయవాడ మధ్య అందబాటులోకి వస్తుందని లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ఈ విమానం 10:10 గంటలకు విజయవాడ నుంచి బయల్దేరి.. ఉదయం 11:30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుందని ప్రకటించారు. ఈ రెండు సర్వీసుల్లో విమాన ఛార్జీలు రూ.4వేల నుంచి రూ.8 వేల మధ్య ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ఈ రెండు విమాన సర్వీసుల్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రజలకు ప్రజలకు విమానయానాన్ని మరింత చేరువ చేయడంతో పాటు.. ప్రధాన నగరాల మధ్య విమానయాన అనుసంధానానికి ఉడాన్ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలోని కడప, కర్నూలు విమానాశ్రయాలను ఉడాన్ ఫథకం కింద అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారువిజయవాడ మాత్రమే కాదు రాజమహేంద్రవరం నుంచి కూడా కొత్తగా మూడు విమాన సర్వీసులు ప్రారంభంకానున్నాయి. ఈ సర్వీసులు కూడా రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు నడపనున్నారని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజయవాడ నుంచి విమాన సర్వీసుల సంఖ్య పెరిగింది. హైదరాబాద్‌తో పాటూ మరికొన్ని నగరాలకు విమానాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇటీవల విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బోయింగ్ విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. విజయవాడ రాజధాని అమరావతి ప్రాంతానికి సమీపంలో ఉండటంతో ప్రయాణికుల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది.. దీంతో రద్దీ కనిపిస్తోంది.






## యానిమేటర్లకు 5 జీ న్యూస్

**విజయవాడ, ఏప్రిల్ 2, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం రెండు నెలల క్రితం యానిమేటర్లకు ఇచ్చిన హామీ ఇచ్చిన హామీని త్వరలోనే నెరవేర్చనుంది. యానిమేటర్లందరికీ 5జీ మొబైల్స్ ఇవ్వబోతోంది. ఇప్పటికే అధికారులు జిల్లాలకు మొబైల్స్‌ను పంపించారు. త్వరలోనే యానిమేటర్లకు మొబైల్స్‌ను పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. యానిమేటర్లకు ఇస్తున్న ఒక్కో ఫోన్ విలువ రూ.15 వేలు.. ఈ కొత్త మొబైల్స్ ద్వారా సేవల్ని మరింత వేగవంతం చేస్తామని యానిమేటర్లు చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యానిమేటర్లకు (వీవోఏ) తీపికబురు చెప్పింది. రెండు నెలల క్రితం చెప్పిన విధంగా యానిమేటర్లకు 5జీ మొబైల్స్‌ను అందించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు జిల్లాలకు మొబైల్స్‌ను ఇప్పటికే పంపించారు.. అవి డీఆర్డీఏ కార్యాలయాలకు చేరాయి. త్వరలోనే మొబైల్స్‌ను యానిమేటర్లకు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. యానిమేటర్లకు ఇస్తున్న ఒక్కో ఫోన్ ధర రూ. 15 వేల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఈ మొబైల్స్ ద్వారా యానిమేటర్లు ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించనున్నారు.డీఆర్‌డీఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో యానిమేటర్లు పొదుపు సంఘాలకు అండగా ఉంటున్నారు. సంఘాల పని తీరు పర్యవేక్షించడం, బుక్ కీపింగ్, బ్యాంకు లింకేజీ, రుణాలు ఇప్పించడం, ప్రభుత్వ రాయితీలు, వడ్డీ లేని రుణాలు, కొత్త సంఘాలను ఏర్పాటు చేయడం, డబ్బులు-మన లెక్కలు అనే యాప్‌కు సంబంధించిన సేవలను యానిమేటర్లు అందిస్తున్నారు. వీరు విధినిర్వహణలో భాగంగా కొన్ని యాప్స్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే వీరికి గతంలో ఇచ్చిన మొబైల్స్, ట్యాబ్స్ పనిచేయకపోవడంతో.. సొంత మొబైల్స్ వాడుతున్నారు. కొంత మంది ఫోన్లు మొరాయించడంతో ఇబ్బంది పడుతున్నారు.దీంతో తమకు మొబైల్స్ ఇవ్వాలని యానిమేటర్లు ప్రభుత్వాన్ని కోరారు. వారిని వినతి పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మొబైల్స్ అందించాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27 వేల 500 మంది యానిమేటర్లు.. 5 వేల మంది కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు మొబైల్స్ అందించనున్నారు. ఈ మొబైల్స్ అందిస్తే సేవల్ని మరింత వేగవంతం చేస్తామని యానిమేటర్లు చెబుతున్నారుఏపీ ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు కూడా మొబైల్స్ అందించిన సంగతి తెలిసిందే. వారికి ఒక్కొక్కరికి రూ.12,500 విలువైన ఫోన్లను అందించడం కోసం ప్రభుత్వం రూ.74 కోట్లు ఖర్చు చేసింది. అంగన్‌వాడీలలో లబ్ధిదారుల వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం వారందరికి మొబైల్స్ అందించింది. మొత్తం మీద అంగన్‌వాడీలకు మొబైల్ కష్టాలు తీరిపోగా.. ఇటు త్వరలోనే యానిమేటర్లకు కూడా కొత్త 5జీ మొబైల్స్ అందజేయనున్నారు.

## తెగేదాక లాగుతున్న దువ్వాడ

**శ్రీకాకుళం, ఏప్రిల్ 2, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మరో అసమ్మతి గళం సోషల్ మీడియా వేదికగా బయటకు వచ్చింది. వ్యక్తిగత వివాదాలతో పార్టీకి దూరం అయిన దువ్వాడ శ్రీనివాస్ ఇటీవలనే జగన్మోహన్ రెడ్డిని కలిశారు. త్వరలో వచ్చి కలుస్తానని చెప్పారు. మీరు ఎలా చెబితే అలా నడుచుకుంటానని కూడా అన్నారు. దీంతో దువ్వాడ శ్రీనివాస్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి రీఎంట్రీ ఇస్తారని ఆయన అభిమానులు తెగ హడావిడి చేశారు. కానీ ఇటీవల జరిగిన పరిణామాలతో దువ్వాడ శ్రీనివాస్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. వైసీపీలో ఆయన రీఎంట్రీ పై అనేక రకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన వైసీపీలో చేరడం దాదాపు అసాధ్యం అని కూడా తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ఆయన వైసీపీలోకి తెచ్చుకునే ఛాన్స్ కనిపించడం లేదు శ్రీకాకుళం జిల్లాలో..ఇటీవల ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మూలపేట పోర్టు సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా శ్రేణులంతా హాజరయ్యాయి. అయితే దీనిపై దువ్వాడ ఇది ఎంత అధర్మం అంటూ పోస్ట్ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన కార్యక్రమాన్ని పొలిటికల్ డ్రామాగా అభివర్ణించారు. పోర్టు లోపలికి 40 మందికి అనుమతి ఉంటే ధర్మాన ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. అధర్మంగా పూర్తికి పది మీటర్ల దూరంలో టెంట్లు వేసుకుని మాట్లాడి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. కోర్టుకు వంద మీటర్ల రోడ్డు కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాల కోసం అసలు ప్రస్తావించలేదని.. నిర్వాసితులకు తీవ్ర నిరాశ మిగిల్చారు అంటూ వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసిపి కార్యక్రమాన్ని దువ్వాడ శ్రీనివాస్ వ్యతిరేకించడం చూస్తుంటే మాత్రం ఆయన రీ యంట్రి విషయం తేలిపోయినట్లు అయింది.అధినేత జగన్మోహన్ రెడ్డి పట్ల వీర విధేయత ప్రదర్శిస్తూ వస్తున్నారు దువ్వాడ శ్రీనివాస్. కానీ జిల్లాలో ధర్మాన సోదరులను వ్యతిరేకిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు ఏకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని డ్రామా తో అభివర్ణించడంతో దువ్వాడ శ్రీనివాస్ కు దారులు మూసుకుపోయినట్టే. దువ్వాడ విషయంలో జిల్లాలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలంతా ఒకే మాటతో ఉన్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత వివాదాలతో పార్టీని ఇబ్బందుల్లో పెట్టిన దువ్వాడను మరోసారి పార్టీలోకి తీసుకోవద్దని జగన్మోహన్ రెడ్డికి తేల్చి చెప్పినట్లు సమాచారం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పోర్టు సందర్శన సక్సెస్ అయ్యిందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కానీ దువ్వాడ శ్రీనివాస్ మాత్రం అదే కార్యక్రమం పై విమర్శలు చేయడంపై వైసీపీ నాయకత్వం కూడా సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు డోర్స్ క్లోజ్ అయినట్టే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి దువ్వాడ శ్రీనివాస్ కు. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## అయోమయంలో వైసీపీ.. చిక్కుల్లో జగన్!

**గుంటూరు, ఏప్రిల్ 2, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత సున్నితమైన, కీలకమైన అమరావతి విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యూహాత్మక తప్పిదం చేసిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. 2019-24 మధ్య మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి, ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకున్న తర్వాత కూడా ఆ పార్టీ తన పంథాను మార్చుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. తాజాగా లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే ఏపీ పునర్విభజన సవరణ బిల్లు-2026 ఆమోదం పొందిన వేళ.. జగన్ మోహన్ రెడ్డి తెరపైకి తెచ్చిన మావిగన్ అనే కొత్త ప్రతిపాదన ఆ పార్టీని మరింత రాజకీయ రక్షణలో పడేసింది.మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులను కలిపి మావిగన్ అనే గ్రోత్ కారిడార్‌ను రాజధానిగా జగన్ ప్రతిపాదించడం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. అయితే, పార్లమెంట్ సాక్షిగా అమరావతికి శాసనపరమైన గుర్తింపు దక్కిన ఈ తరుణంలో ఇలాంటి ప్రతిపాదనలు చేయడం చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం లాంటిదేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమరావతి ఇప్పుడు కేవలం ఒక రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మాత్రమే కాదు, అది పార్లమెంట్ ఆమోదించిన చట్టం. జగన్ భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా తన వ్యక్తిగత కార్యాలయాలను ఎక్కడైనా పెట్టుకోవచ్చు కానీ, రాజధానిని తరలించడం అనేది ఇప్పుడు అసాధ్యమైన ప్రక్రియగా మారింది.రాజధాని విషయంలో వైసీపీ అనుసరిస్తున్న దోబూచులాట ఆ పార్టీ క్యాడర్‌ను కూడా గందరగోళానికి గురిచేస్తోంది. ఒకవైపు అమరావతికి తాము వ్యతిరేకం కాదని చెబుతూనే, మరోవైపు పార్లమెంట్‌లో బిల్లును వ్యతిరేకించి వాకౌట్ చేయడం ద్వారా తమ ద్వంద్వ వైఖరిని బయటపెట్టుకున్నారు. ఈ సమయంలో అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, కేవలం అక్కడ జరుగుతున్నట్లుగా తాము భావిస్తున్న అవినీతి పై మాత్రమే పోరాటం చేసి ఉంటే వైసీపీకి రాజకీయంగా మైలేజీ దక్కేది. కానీ, ఇప్పుడు మావిగన్ వంటి కొత్త పేర్లతో గందరగోళం సృష్టించడం వల్ల ప్రజల్లో ఆ పార్టీ విశ్వసనీయత మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది.అమరావతిని స్మశానం అని, గ్రాఫిక్స్ అని ఎద్దేవా చేసిన నేతలే, ఇప్పుడు రాజధాని హోదా కల్పించడాన్ని తప్పుపడుతున్నారు. సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు వంటి వారు అన్నీ అమరావతికే చేస్తే మేము అడుక్కుతినాలా? అని చేస్తున్న వ్యాఖ్యలు ప్రాంతీయ విద్వేషాలను రేకెత్తించేలా ఉన్నాయి. ఇలాంటి వ్యాఖ్యలను కట్టడి చేయకుండా, జగన్ కూడా అదే బాటలో ప్రయాణించడం ఆయన రాజకీయ భవిష్యత్తుకే ముప్పు తెచ్చేలా ఉంది. అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ముద్ర ఇప్పటికే పడటంతో, మావిగన్ ప్రతిపాదన ఆ ముద్రను మరింత బలపరుస్తోంది. రాజకీయాల్లో టైమింగ్ చాలా ముఖ్యం. కేంద్రం అమరావతికి నిధులు ఇవ్వడమే కాకుండా చట్టబద్ధత కూడా కల్పిస్తున్నప్పుడు, దానికి క్రెడిట్ రాకుండా చూడటం లేదా ఆ క్రెడిట్‌లో భాగస్వామ్యం కావడం విజ్ఞత అనిపించుకుంటుంది. కానీ వైసీపీ వ్యూహకర్తలు జగన్ చేత చట్టాన్ని సవరించలేరా అనే వ్యాఖ్యలు చేయించడం ద్వారా తాము అభివృద్ధి నిరోధకులమనే సంకేతాలు పంపారు.

# ఏప్రిల్ లోనే గూగుల్ డేటా సెంటర్ భూమి పూజ

**విశాఖపట్టణం, ఏప్రిల్ 2,పెన్ పవర్:**
విశాఖపట్నం జిల్లాలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు చకచకా అడుగులు పడుతున్నాయి. తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే భూములు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా భూములలో జంగల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు కూడా ముగింపు దశకు చేరుకుంటున్నాయి. మరోవైపు గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ఈ నెలలోనే భూమి పూజ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.విశాఖపట్నం జిల్లాలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆనందపురం మండలంలోని తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. డేటా సెంటర్ ప్రాజెక్టు కోసం కేటాయించిన భూముల్లో అధికారులు జంగల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు. డేటా సెంటర్ కోసం తర్లువాడలోని సర్వేనంబర్ ఒకటిలో ఉన్న 308 ఎకరాలను ఏపీ ప్రభుత్వం గూగుల్ సంస్థకు కేటాయించింది. అలాగే ఆయా భూముల రైతులకు ఇప్పటికే నష్టపరిహారాన్ని జమ చేసింది. గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన భూములలో మామిడి, జీడి మామిడి వంటి తోటలు, ఇతర చెట్లు ఉన్నాయి. వీటిని తొలగించే పనిని ఏపీ ప్రభుత్వం ఏపీఐఐసీకి అప్పగించింది.ఏపీఐఐసీ ఓ కాంట్రాక్టర్‌కు ల్యాండ్ స్కేపింగ్ పనులు అప్పగించింది. ఈ నేపథ్యంలో సదరు కాంట్రాక్ట్ సంస్థ జంగల్ క్లియరెన్స్ పనులు చేపట్టగా.. మెజారిటీ పనులు పూర్తయ్యాయి. భూమిని చదును చేయాల్సి ఉంది. మరోవైపు ఏప్రిల్ నెలలోనే గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే పనులు వేగవంతం చేశారు.



మరోవైపు గూగుల్ అనుబంధ సంస్థ అయిన రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని నోటిఫైడ్ భాగస్వామ్య సంస్థ కలిసి 1000 మెగావాట్ల సామర్థ్యంతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. ఈ డేటా సెంటర్ కోసం15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది.ఈ ప్రాజెక్టు కోసం ఏపీ ప్రభుత్వం తొలుత విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో 480 ఎకరాలు కేటాయించింది. అయితే గూగుల్ ప్రతినిధులు అదనపు భూములు కోరటంతో.. ఏపీ ప్రభుత్వం రాంబిల్లిలో 174.8 ఎకరాలు, తర్లువాడ లో 266.6 ఎకరాలు, అడవివరంలో 160 ఎకరాలను కలిపి 601.4 ఎకరాలను కేటాయించింది. ముందుగా అనుకున్న ప్రకారం తొలుత తర్లువాడలో డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్ల కోసం ఏపీ పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఇటీవలే విశాఖపట్నంలో పర్యటించారు. ఏపీఐఐసీ అధికారులతో తర్లువాడ భూములను పరిశీలించారు. ఈ క్రమంలోనే జంగల్ క్లియరెన్స్ పనులు వేగవంతం చేశారు.

# ఇమేజ్ ను డ్యామేజ్ చేస్తున్న మావిగన్...

**విజయవాడ, ఏప్రిల్ 2,పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత ఐదేళ్లుగా 'రాజధాని' అనే అంశం ఒక ముగింపు లేని ప్రహసనంలా సాగుతోంది. మూడు రాజధానులంటూ గతంలో చేసిన ప్రయోగాలు విఫలమై, ప్రస్తుతం అమరావతికి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పిస్తున్న తరుణంలో, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తాజాగా తెరపైకి తెచ్చిన 'మావిగన్' అనే వింత పేరు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాస్యాస్పదంగా మారింది. సీరియస్ రాజకీయాలు చేయాల్సిన సమయంలో జగన్ ఇలాంటి వింత పేర్లతో ముందుకు రావడంపై నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడుతున్నారు.అక్షరాలను కలిపి ఏదో ఇంటర్నేషనల్ బ్రాండ్ పేరులా వినిపిస్తున్న ఈ 'మావిగన్' అనే పదం వినగానే జనం నోరెళ్లబెడుతున్నారు. అసలు ఈ పేరు ఎక్కడ నుండి పుట్టింది? దీని వెనుక ఉన్న లాజిక్ ఏంటి? అని ఆరా తీస్తున్నారు. రాజధాని విషయంలో ఇప్పటికే ప్రజల్లో ఉన్న గందరగోళాన్ని తొలగించాల్సింది పోయి, ఇలాంటి అల్లాటప్పా పేర్లతో కాలయాపన చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "గతంలో మూడు రాజధానులు అన్నారు, ఇప్పుడు ఈ కొత్త 'గన్' ఎక్కడి నుండి వచ్చింది?" అంటూ సామాన్యులు జోకులు వేసుకుంటున్నారు.ఈ 'మావిగన్' పేరుపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించిన తీరు ఇప్పుడు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతోంది. మీడియా ప్రతినిధులు ఈ పేరును ప్రస్తావించగానే, పవన్ కళ్యాణ్ ఆపుకోలేక నవ్విన తీరు జగన్ రాజకీయ పరిజ్ఞానంపై ఆయనకున్న అభిప్రాయాన్ని స్పష్టం చేసింది. "ఇన్ని వింత పేర్లు వీరికి ఎక్కడ దొరుకుతాయో ఏమో!" అన్నట్లుగా పవన్ ఇచ్చిన ఆ వెటకారపు నవ్వు, జగన్ ప్రతిపాదన ఎంత సిల్లీగా ఉందో చెప్పకనే చెప్పిఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా ఉండాల్సిన వ్యక్తి, ఇలాంటి హాస్యాస్పదమైన మాటలతో నవ్వులపాలవ్వడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పవన్ నవ్వు జగన్ వైఖరికి ఒక బలమైన మౌన కౌంటర్ లా మారిందని చర్చించుకుంటున్నారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన ఎక్స్, వాట్సాప్ గ్రూపుల్లో 'మావిగన్' పై రచ్చ మామూలుగా లేదు. "మావిగన్ అంటే ఏదో కొత్త రకమైన విదేశీ తుపాకీ పేరులా ఉంది" అని కొందరు సెటైర్లు వేస్తుంటే, మరికొందరు "సీజన్ మారినప్పుడల్లా రాజధాని పేరు మార్చడం జగన్ కే చెల్లింది" అని విమర్శిస్తున్నారు. జగన్ పాత వీడియోలను, ఇప్పటి మావిగన్ మాటలను కలిపి నెటిజన్లు క్రియేటివ్ పేరడీ వీడియోలు సృష్టిస్తున్నారు. ఒక సీరియస్ రాజకీయ అంశాన్ని జగన్ కామెడీ షోగా మార్చేశారని, అందుకే ఆయనను విమర్శించాలన్నా జాలి వేస్తోందని నెటిజన్లు 'పాపం జగన్' అంటూ హ్యాష్ ట్యాగ్‌లు ట్రెండ్ చేస్తున్నారు.అమరావతిని అడ్డుకోవడానికి జగన్ ఎన్ని దారులు వెతికినా చివరకు ఇలాంటి సిల్లీ ప్రతిపాదనల దగ్గరే ఆగిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంట్ చట్టం చేస్తున్నా సరే, ఇంకా ఏదో ఒక వింత పేరుతో కాలయాపన చేయడం వల్ల పార్టీకే నష్టమని వైసీపీ నేతలు కూడా లోలోపల మదనపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.మొత్తానికి, 'మావిగన్' పేరుతో జగన్ రెడ్డి తన రాజకీయాల్లో మరో 'సెల్ఫ్ గోల్' వేసుకున్నారని స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన రాజధాని అంశాన్ని ఒక కుళ్లు జోక్ స్థాయికి తగ్గించేలా జగన్ వ్యవహరించడం శోచనీయమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవేళ ఇది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం అయితే, అది బెడిసికొట్టి జగన్ ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేసిందనడంలో అతిశయోక్తి లేదు.

# పోలవరానికి నిధులు...

**ఏలూరు, ఏప్రిల్ 2, పెన్ పవర్:**
ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఏపీ జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు రూ.1301 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులు పోలవరం ప్రాజెక్టు అకౌంట్లోకి నేరుగా జమ అవుతాయని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఏపీ విషయంలో కేంద్రం ఉదారంగా వ్యవహరిస్తోంది. మూడోసారి ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత వార్షిక బడ్జెట్లో అమరావతి రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించింది. గతంలో రూ.1508 కోట్లు విడుదల చేయగా.. తాజాగా మరోసారి కేంద్రం అడ్వాన్సుడ్ నిధులు కేటాయించింది. మొత్తానికి ఈ 22 నెలల్లో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రూ.2809కోట్లు అందినట్లు అయింది. మరోవైపు ఈనెల 2న పోలవరం పర్యటనకు వెళ్తున్నారు గవర్నర్ అబ్దుల్ నజీర్. ఎప్పటికప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు పనులను సమీక్షిస్తూ వచ్చారు. పోలవరం పై కేంద్రానికి నివేదికలు ఇస్తూనే ఉన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ నిధులను కేటాయించింది. అయితే గత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల మేరకు నిధులు దాదాపుగా వచ్చేశాయి.కేంద్ర ప్రభుత్వం గతంలో రూ.1508 కోట్లు మంజూరు చేయగా అందులో రూ.600 కోట్లు ప్రాజెక్టు పనుల కోసం కేటాయించింది. మరో రూ.300 కోట్లు పునరావసం, భూ సేకరణ కోసం ఖర్చు చేశారు. ఇటీవల కేంద్ర జలశక్తి అధికారులు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చారు. ఆ సమయంలో ఏపీ అధికారులు నీతుల విషయాన్ని ప్రస్తావించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు కోసం సింగిల్ నోడల్ అకౌంట్ కు నిధులను విడుదల చేయడం ఇదే చివరిసారి. ఇకపై స్పర్శ విధానంలో నిధులను విడుదల చేయనున్నారుసకాలంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేసి జాతికి అందించాలన్న లక్ష్యంతో ఉంది ఏపీ ప్రభుత్వం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో శరవేగంగా పనులు జరిపిస్తోంది. గత అనుభవాల దృష్ట్యా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని చూస్తోంది. అయితే మొన్నటి బడ్జెట్ సెషన్స్ లో సైతం ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పోలవరం ప్రాజెక్టు ప్రత్యేక ప్రస్తావన తీసుకొచ్చారు. ఆ ప్రాజెక్టుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే ఇప్పుడు భారీగా నిధులు కేటాయించారు. ఇది శుభ పరిణామం కూడా..



# అప్పుడేమో కేల్ రాహుల్, ఇప్పుడు రిషబ్ పంత్‌ను ఘోరంగా అవమానించిన లక్నో ఓనర్




**హైదరాబాద్ పెన్ పవర్:** లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, తన జట్టు ఆటగాళ్లతో వ్యవహరించే తీరు మొదటి నుంచి వివాదస్పదంగా మారింది. రైజింగ్ పూణే సూపర్ జెయింట్స్ ఉన్నప్పుడు ధోనీని కెప్టెన్సీ నుంచి తప్పించి, స్టీవ్ స్మిత్‌కి సారథ్య బాధ్యతలు అప్పగించిన సంజీవ్ గోయెంకా. ఆ తర్వాత 2024 సీజన్‌లో స్టేడియంలోనే కేఎల్ రాహుల్‌ని తిట్టడంతో వివాదాల్లో నిలిచాడు. అయినా అతని పద్ధతిని ఏ మాత్రం మార్చుకోలేదు. ఏప్రిల్ 1న ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో లక్నో ఓడిపోయిన తర్వాత కెప్టెన్ రిషబ్ పంత్‌పై అతడు సీరియస్ అయ్యాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 18.4 ఓవర్లలో 141 పరుగులకి ఆలౌట్ అయ్యింది. సమీర్ రిజ్వీ హాఫ్ సెంచరీతో ఈ లక్ష్యాన్ని 17.1 ఓవర్లలోనే ఢిల్లీ ఛేదించింది. ఆరంభంలో లక్నో బౌలర్లు వెంటవెంటనే 4 వికెట్లు తీసినప్పటికీ.. సమీర్ రిజ్వీ ( 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులతో 70 పరుగులు) , ట్రిస్టన్ స్టబ్స్ ( 32 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్సులతో 39 పరుగులు) కలిసి 119 పరుగుల భాగస్వామ్యంతో మ్యాచ్‌ని సక్సెస్ ఫుల్ గా ముగించేశారు.

**రిషబ్ పంత్‌తో సీరియస్ చర్చలు:**

ఈ ఓటమి తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, కెప్టెన్ రిషబ్ పంత్‌తో గ్రౌండ్‌లో సీరియస్‌గా చర్చించడం కెమెరాల్లో కనిపించింది. వాళ్లేం మాట్లాడుకున్నారో వినిపించకపోయినా సంజీవ్ , రిషబ్ పంత్‌కి ఏదో చూపిస్తూ సీరియస్‌గా చెప్పడం, దానికి అతను ముఖం చిన్నబుచ్చుకోవడం నెట్టింట వైరల్ గా మారిన వీడియోల్లో కనిపిస్తుంది. జట్టు పర్ఫామెన్స్ కారణంగా సంజీవ్ గోయెంకాకి కోపం రావడంలో తప్పు లేదు, కానీ ఇలా గ్రౌండ్‌లోకి వచ్చి మరీ ఇంటర్నేషనల్ క్రికెటర్‌ని ఘోరంగా అవమానించడం మాత్రం కరెక్ట్ కాదని నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. రూ.27 కోట్లు పెట్టి కొనుగోలు చేశామని.. ఎన్ని తిట్టినా భరించాలని అనుకునే కార్పరేట్ పద్ధతి, జెంటిల్మెన్ గేమ్ క్రికెట్‌కి సెట్ కాదనే విషయాన్ని సంజీవ్ గోయెంకా గుర్తు పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

**గతంలో కేఎల్ రాహుల్‌ని తిట్టిన సంజీవ్:**

2024 ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 10 వికెట్ల తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో, 165 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ కొట్టిన కొట్టుడికి ఈ లక్ష్యాన్ని 9.4 ఓవర్లలోనే ఊదేసింది సన్‌రైజర్స్. ఈ మ్యాచ్ అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, స్టేడియంలోనే అప్పటి లక్నో టీమ్ కెప్టెన్ కేఎల్ రాహుల్‌ని తిట్టడం సంచలనంగా మారింది.

**సంజీవ్ గోయెంకా తీరుపై విమర్శలు:**

ఈ ఘటన తర్వాత క్రికెట్ అభిమానులు, మాజీ క్రికెటర్లు అందరూ కూడా సంజీవ్ గోయెంకా తీరుని తీవ్రంగా తప్పుబట్టారు. డబ్బులు పెట్టినంత మాత్రాన, అంతర్జాతీయ క్రికెట్ ఆడే ప్లేయర్‌ని ఇలా మైదానంలో ప్రేక్షకులందరి ముందు చివాట్లు పెట్టి, అవమానించడం మంచి పద్ధతి కాదని విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో బ్యాడ్ అయిపోవడంతో కేఎల్ రాహుల్‌ని ఇంటికి పిలిచి, డిన్నర్ ఏర్పాటు చేసి సంజీవ్ గోయెంకా 'సారీ' చెప్పగా.. అందరి ముందు తిట్టి, ప్రైవేటుగా సారీ చెబితే చెల్లిపోతుందా? అందుకే ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్‌ని వీడి, ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరాడు.

ఇక ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్సీ ఆఫర్ చేసినా గత అనుభవం కారణంగానే సారథ్య బాధ్యతలు తీసుకోవడానికి కేఎల్ రాహుల్ ఇష్టపడలేదు. 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో 57 పరుగులు చేసి, ఢిల్లీ క్యాపిటల్స్‌ని విజయం అందించాడు. మ్యాచ్ తర్వాత సంజీవ్ గోయెంకా మాట్లాడడానికి ప్రయత్నించినా.. రాహుల్ పట్టించుకోకపోవడం కెమెరాల్లో కనిపించింది. కానీ ఈసారి సంజీవ్ గోయెంకా తీరు మార్చుకోకపోతే రిషబ్ పంత్ కూడా లక్నో సూపర్ జెయింట్స్ నుంచి జంప్ కావడం ఖాయమంటూ ఐపీఎల్ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు దక్షిణాఫ్రికా స్టార్ క్రికెటర్ వీడ్కోలు.. వన్డేల్లో ఏబీడీ తర్వాత అతడే!




**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికా క్రికెట్‌లో నమ్మకమైన వైట్-బాల్ బ్యాటర్‌గా పేరుగాంచిన రాసీ వాన్ డర్ డస్సెన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన ద్వారా వెల్లడించాడు. దేశం తరఫున ఆడటం తన జీవితంలో దక్కిన గొప్ప గౌరవమని, ఈ ప్రయాణంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన భావోద్వేగానికి గురయ్యాడు."గర్వంతో, కృతజ్ఞతాభావంతో నేను నా అంతర్జాతీయ క్రికెట్ రిటైర్మెంట్‌ను ప్రకటిస్తున్నాను. ప్రొటీస్ జెర్సీ ధరించడం ఒక ప్రత్యేకమైన అనుభూతి. నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో దక్కిన అతిపెద్ద గౌరవం. ఈ ప్రయాణం కోసం ఎన్నో త్యాగాలు చేశాను. కానీ దక్షిణాఫ్రికా తరఫున ఆడిన ప్రతీ క్షణం ఎంతో విలువైనది" అని తన ప్రకటనలో పేర్కొన్నాడు.

దేశవాళీ క్రికెట్, వివిధ టీ20 లీగ్‌లలో రాణించిన తర్వాత 29 ఏళ్ల వయసులో లేటుగా వాన్ డర్ డస్సెన్ దక్షిణాఫ్రికా జట్టులోకి అరంగేట్రం చేశాడు. 2019లో ఇంగ్లండ్‌పై టెస్టుల్లో అడుగుపెట్టినా, అతడు వన్డే ఫార్మాట్‌లో అత్యద్భుతంగా రాణించాడు. దక్షిణాఫ్రికా మిడిల్ ఆర్డర్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. మొత్తం 71 వన్డే మ్యాచ్‌లలో 50కి పైగా సగటుతో 2,657 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికా తరఫున అత్యధిక సగటు కలిగిన ఆటగాళ్ల జాబితాలో ఏబీ డివిలియర్స్ తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. తన కెరీర్‌లో 18 టెస్టులు, 57 టీ20లు కూడా ఆడాడు. ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన వారిని రాసీ గుర్తుచేసుకున్నారు. "క్రికెట్ దక్షిణాఫ్రికా, కోచ్‌లు, మేనేజర్‌లకు నా ధన్యవాదాలు. నా భార్య లారా ప్రతీ అడుగులో నాకు తోడుగా నిలిచింది. అభిమానులు నన్ను 'మా థౌజండ్' అని పిలవడం, వాండరర్స్ స్టేడియంలో బ్యాటింగ్‌కు వెళ్తున్నప్పుడు ప్రేక్షకుల కేరింతలు ఎప్పటికీ మర్చిపోలేను" అని తెలిపాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, తన ప్రయాణం ముగియలేదని వాన్ డర్ డస్సెన్ స్పష్టం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో తన జట్టు 'లయన్స్' తరఫున ఆడటాన్ని కొనసాగిస్తానని, భవిష్యత్ తరాల దక్షిణాఫ్రికా క్రికెటర్లకు మార్గనిర్దేశం చేస్తానని పేర్కొన్నాడు. యువ ఆటగాళ్లు పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డాలని రాసీ సూచించాడు.

## 15 ఏళ్లయినా ఆ రాత్రిని మర్చిపోలేం.. 2011 ప్రపంచకప్ ఫైనల్‌పై సచిన్ ఎమోషనల్ పోస్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన 2011 ప్రపంచకప్ విజయాన్ని సాధించి నేటికి 15 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నాడు. ఆ ఫైనల్ మ్యాచ్‌లోని ఉత్కంఠను, విజయం తర్వాత కలిగిన ఆనందాన్ని పంచుకుంటూ సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టాడు."మొదటి బంతి ఎప్పుడూ గుండె వేగాన్ని పెంచుతుంది. కానీ ఆ రాత్రి, ఆ వేగం అస్సలు తగ్గలేదు. 15 ఏళ్ల తర్వాత కూడా ఆ జ్ఞాపకాలు మాతోనే ఉన్నాయి. భారత్ కోసం ప్రపంచకప్ గెలవాలనే ఒకే ఒక్క కలతో మేమంతా పెరిగాం. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతీ ఒక్కరికీ, అభిమానులందరికీ ధన్యవాదాలు" అంటూ సచిన్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్‌ను సొంత గడ్డపై గెలవడం సచిన్‌కు మరపురాని అనుభూతిని మిగిల్చింది.2011 ఏప్రిల్ 2న ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, శ్రీలంక జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక, మహేల జయవర్ధనే అద్భుతమైన సెంచరీతో (103 నాటౌట్) రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 274 పరుగుల భారీ స్కోరు సాధించింది.275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గౌతమ్ గంభీర్, బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 3 పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్నప్పటికీ, 97 పరుగులతో విజయానికి బలమైన పునాది వేశాడు.అనంతరం కెప్టెన్ ఎంఎస్ ధోనీ క్రీజులో నిలబడి మ్యాచ్‌ను తన చేతుల్లోకి తీసుకున్నాడు. యువరాజ్ సింగ్‌తో (21 నాటౌట్) కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ధోనీ, కేవలం 79 బంతుల్లో 91 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. చివరిలో సిక్సర్ బాది భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో 28 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 1983 తర్వాత భారత్ రెండోసారి వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడి, దేశవ్యాప్తంగా సంబరాల్లో మునిగిపోయింది.

# నిర్మాతగా దూసుకుపోతున్న సుకుమార్!

నేహా శర్మ లుక్ మిస్ అవ్వడం చాలా బాగుంది





శ్రేయా ధన్వంతరి కాన్ఫిడెంట్ న్యూ లుక్‌లో టోన్డ్ అబ్స్‌ని ప్రదర్శించింది



దర్శకుడిగా సుకుమార్ ఎలాంటి విజయాలు అందించారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. -ఆర్య- నుంచి -పుష్ప 2- వరకూ ఎన్నో వైవిధ్యమైన చిత్రాల్ని అందించారు. ప్రత్యేకించి -పుష్ప- విజయంతో స్టార్ డైరెక్టర్ గా ఇండియాలోనే ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నారు. ప్రస్తుతం ఇండియాన్ టాప్ 5 డైరెక్టర్లలో ఆయన ఒకరు. ఇప్పుడా యనతో సినిమాలు చేయడానికి బాలీవుడ్ సహా స్టార్ హీరోలంతా క్యూలో ఉన్నారు. అలాగే తెలివైన శిష్యులను అందించడంలోనూ ఆయనే ముందున్నారు. ఇప్పటికే ఆయన స్కూల్ నుంచి కొంత మంది శిష్యులు డైరెక్టర్లగా రాణిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే నిర్మాతగానూ సుకుమార్ మరింత బిజీ అవుతున్నారు. ఈ విషయంలో ఏ స్టార్ డైరెక్టర్ లేనంత బిజీగా సుకుమార్ కనిపిస్తున్నారు. వరుసగా తన సొంత బ్యానర్ సుకుమార్ క్రియేటివ్ వర్క్స్ లో సినిమాలు నిర్మిస్తూ హైలైట్ అవుతున్నారు. -కుమారి 21 ఎఫ్- తో నిర్మాతగా తెరంగేట్రం చేసిన లెక్కలు మాస్టారు అనంతరం అదే సినిమా రీమేక్ కు సమర్పకుడిగా వ్యవహరించారు. -100 పర్సంట్ కాదల్- ను సమర్పించారు. అటుపై బుచ్చి బాబు దర్శకత్వం వహించిన -ఉప్పెన- కు నిర్మాతగా పని చేసారు. -విరూపాక్ష- చిత్ర నిర్మాణంలోనూ భాగమయ్యారు.-మంజుమ్మల్ బోయ్స్- లాంటి మలయాళ చిత్రాన్ని తెలుగు అనువాదంలో ఆయన హస్తం ఉంది. ప్రస్తుతం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తోన్న -పెద్ది- సినిమాకు నిర్మాతగా కొనసాగుతున్నారు. మరో రెండు బ్యానర్లతో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అలాగే నాగ చైతన్య హీరోగా కార్తీక్ దండు తెరకెక్కిస్తోన్న -వృషకర్మ- సినిమా నిర్మాణంలో భాగమయ్యారు. అసలు విషయం ఏంటంటే ఈ సినిమాలన్నింటినీ తన శిష్యులు డైరెక్ట్ చేయడం ఇంట్రెస్టింగ్. ఆ కథల్లో సుకుమార్ హస్తం కూడా ఉంది. రచన విభాగంలో ఆయన ఇన్వాల్వ్ అవుతూ అవసరమైన ఇన్ పుట్స్ ఇస్తున్నారు.ఆ రకంగా తన బ్రాండ్ ను, పేరునే పెట్టుబడి పెడుతున్నారు. తాజాగా ప్రియదర్శి హీరోగా కూడా ఓ సినిమా నిర్మిస్తున్నారు. తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిది. బన్నీ వాసుతో కలిసి సుకుమార్ ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. ఇవిగాక మరో రెండు..మూడు చిత్రాలకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. ఓ స్టార్ డైరెక్టర్ నిర్మాతగా ఇంత బిజీగా ఉండటం అన్నది సుకుమార్ కే చెల్లింది. -పుష్ప 2- రిలీజ్ అయిన దగ్గర నుంచి సుకుమార్ నిర్మాణంలోనే బిజీగా ఉంటున్నారు. త్వరలోనే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కొత్త చిత్రం ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నారు. -పెద్ది- రిలీజ్ అనంతరం చిత్రాన్ని పట్టాలెక్కించనున్నారు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965